తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110


# కబురు

KABURU TELUGU DAILY

300 కోట్లు దాటిన సంక్రాంతికి వస్తున్నాం

మిగతాది 8లో

ఇదండీ..కబురు..




సంపుటి : 23 సంచిక : 82 | శుక్రవారం మార్చి 07 2025 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5

## ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లుకు

# తెలంగాణ మంత్రి వర్గం ఆమోదం



**కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి06**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎస్సీ కులాల వర్గీకరణ ముసాయిదా బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. న్యాయపరమైన చిక్కులు లేకుండా తుది మెరుగులు దిద్దాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. బడ్జెట్ సమావేశాల నిర్వహణ, ఆ సమావేశాల్లో ప్రవేశపెట్టాల్సిన బిల్లులపై ఈ భేటీలో చర్చించి ఆమోదించనున్నట్లు సమాచారం. యాదగిరిగుట్ట దేవస్థాన బోర్డుకు సంబంధించి ఎండోమెంట్ సవరణ బిల్లును కూడా క్యాబినెట్‌లో చర్చించి ఆమోదించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

# బీజేపీ ఎమ్మెల్సీకి ప్రధాని అభినందనలు



**కబురు న్యూస్,న్యూఢిల్లీ,మార్చి06:**

తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయంతో కొత్తగా ఎన్నికైన మల్క కొమరయ్య, అంజిరెడ్డిని ప్రధాని మోదీ అభినందించారు. బీజేపీకి మద్దతుగా నిలిచిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలతో కలిసి పనిచేస్తున్న తమ పార్టీ కార్యకర్తలను చూసి గర్విస్తున్నానన్నారు. కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గపు ఎమ్మెల్సీలుగా బీజేపీ అభ్యర్థులు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమరయ్య విజయం సాధించారు. కొమరయ్య విజయం రెండు రోజుల క్రితమే ఖరారుకాగా, పట్టభద్రుల ఫలితం బుధవారం వెలువడింది. కాగా, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో ఫలితం తేలకపోవడంతో.. రెండో ప్రాధాన్య ఓట్లతో అంజిరెడ్డి గెలుపొందారు. రెండు రోజుల పాటు జరిగిన కౌంటింగ్ ప్రక్రియ అడుగడుగునా ఉత్కంఠ రేపింది. బీజేపీ-కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య 'నువ్వానేనా' అన్నట్టుగా గెలుపు దోబూచులాడింది. ఉమ్మడి నాలుగు జిల్లాల్లో పట్టభద్రుల స్థానానికి మొత్తం 2,52,029 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 28,686 ఓట్లు చెల్లలేదు.వీటిలో 75,675 బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి, 70,565 కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి, 60,419 ఓట్లు బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు వచ్చాయి. నిబంధనల ప్రకారం మొదటి ప్రాధాన్యతలోనే 1,11,672 ఓట్లు పొందిన అభ్యర్థిని విజేతగా ప్రకటించాలి. కానీ మొదటి ప్రాధాన్యంలో ఏ అభ్యర్థికి కూడా అన్ని ఓట్లు రాలేదు. దీంతో రెండో ప్రాధాన్య ఓట్లు లెక్కించారు. మొత్తం 56 మంది పోటీచేయగా, రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించేందుకు గాను 54 మందిని ఎలిమినేట్ చేస్తూ వచ్చారు. చివరకు బీజేపీ అభ్యర్థికే అత్యధిక ఓట్లు వచ్చాయి. గెలుపు కోటాకు అవసరమైన ఓట్లు రాకపోయినా 5వేల పైచిలుకు ఓట్ల ఆధిక్యం ఉండడంతో మూడో ప్రాధాన్యానికి వెళ్లకుండా అంజిరెడ్డి గెలిచినట్టు అధికారులు ప్రకటించారు.

# నిజాలను దాచకుండా బయట పెట్టండి ..

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- పనులు వద్దని నివేదికలు
- కమిషన్ల కోసమే చేసింద్రు
- ఘటనపై హైకోర్టు జడ్జితో విచారణ చేయండి

**కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి06**

ఎస్ఎల్ బీసీ టన్నెల్ లో ప్రమాదం జరుగుతుందని ముందే తెలిసిన ప్రభుత్వం నిజాలను దాచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎస్ఎబీసీ టన్నెల్ ప్రమాదం జరుగుతుందని ముందే రెండు నివేదికలు హెచ్చరించిన ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ' కార్మికుల ప్రాణాలను పనంగా పెట్టి నిర్లక్ష్య ధోరణితో ప్రభుత్వం ముందుకు పోయింది. టన్నెల్ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని రెడ్ జోన్‌గా ప్రకటిస్తూ గతంలో రెండు నివేదికలు ప్రభుత్వం వద్ద ఉన్న కేవలం కమిషన్ల కోసమే పనులను నిర్వహించింది.



నివేదికల్లో చెప్పిన తీరుగా ఆ ప్రాంతంలోనే ప్రమాదం జరిగింది. 8 మంది కార్మికుల కుటుంబాల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయి.అదేవిధంగా వేలకోట్ల ప్రజాధనం వృధా అయింది. సీఎం రేవంత్ రెడ్డి తో పాటు మొత్తం క్యాబినెట్ ఈ ప్రమాదానికి బాధ్యత వహించాలి. ఈ రెండు నివేదికల అంశంపైన ప్రభుత్వం స్పష్టతను ఇవ్వాలి. ఈ ఘటనపై హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో దర్యాప్తు జరిపించాలని, ప్రాణాలు కోల్పోయిన ఎనిమిది కుటుంబాలతో పాటు రాష్ట్ర ప్రజల తరపున ఈ అంశంపై పూర్తి వివరాలు విడుదల చేసి ప్రమాదానికి బాధ్యత తీసుకోవాలి' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.



## అడుగంటుతున్న భూగర్భ జలాలు

## ఆందోళన చెందుతున్న రైతులు

**కబురు న్యూస్,పెద్దపల్లి, మార్చి06**

రోజురోజుకూ భూగర్భ జలాలు పడిపోతున్నాయి. దీంతో ఒక వైపు బోర్లు ఎత్తిపోతుండగా.. మరో వైపు బావుల్లో నీరు అడుగంటి పోతున్నాయి. దీంతో సాగు కష్టాల్లో, ఆర్థిక నష్టాల్లో రైతులు కూరుకుపోతున్నారు. నిన్న మొన్నటి వరకు పెద్దపల్లి జిల్లాపై కుండగా ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టులోని అంతర్భాగమైన అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో చుక్కనీరు లేకపో వడంతో బోర్లు, బావులు అడుగంటుతున్నాయి. దీంతో రైతులు తిరిగి బోర్లు వేసుకోవడం, బావులను పూడిక తీయడం లాంటి పనులను చేపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

2లో..



## అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్యాయత్నం

### భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం

**కబురు న్యూస్,ఆదిలాబాద్, మార్చి06**

అటు ప్రకృతి కన్నెర్ర.. ఇటు ప్రభుత్వం నిర్లక్ష్యంతో రైతులు ఆత్మహత్య బాట పడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా నేరేడుకొండ మండలంలో ఓ రైతు దంపతులు అప్పుల ఇబ్బందులతో ఆత్మహత్యకు ఒడిగట్టారు.

2లో..

## కాంగ్రెస్ పాలనలో

# ఏ ఒక్కవర్గం సంతోషంగా లేరు

- స్కాలర్‌షిప్‌లు రాక విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు
- రేవంత్‌రెడ్డి అవగాహన లేని పాలనతో కష్టాలు : హరీశ్‌రావు



**కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి06:**

కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ఓ వర్గం సంతోషంగా లేరని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పాలనపై అవగాహన సీఎం రేవంత్‌రెడ్డి అవగాహనరాహిత్యంతో అందరూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా స్కాలర్‌షిప్‌ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పేద, మధ్యతరగతి విద్యార్థులకు శాపంగా విమర్శించారు. విదేశీ విద్యా పథకం కింద ఎంపికై, విదేశాలకు వెళ్లిన విద్యార్థులు స్కాలర్ షిప్ డబ్బులు రాక ఆవేదన చెందుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేకపోవడం దుర్మార్గమన్నారు.

2లో..

# ఆ రెండు పార్టీలు కలిసి

# కాంగ్రెస్‌ను ఓడించాయి



**కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి06:**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాజపా, భారాస రెండూ కలిసే కాంగ్రెస్‌ను ఓడించాయని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఎమ్మెల్సీ ఫలితాలపై ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. "అభ్యర్థిని పెట్టకుండా భాజపాతో కలిసి భారాస కుమ్మక్కయ్యింది. కేటీఆర్, హరీశ్‌రావు నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారిద్దరు ఎవరికి ఓటేశారో చెప్పాలి. తక్కువ ఓట్లతోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోయాం. ఈ ఓటమిపై సమీక్షించుకుంటాం"అని అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లడుతూ.. కాంగ్రెస్‌ను ఓడించడానికి భాజపా, భారాస కలిసి పనిచేశాయన్నారు. పట్టభద్రులకు నైపుణ్యాన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తున్నారని తెలిపారు.




2లో

## నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి మోసాలు.. 60 మంది అరెస్టు

**కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి06:**

నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి విదేశీయులను మోసగిస్తున్న ముఠాను సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. గుజరాత్‌కు చెందిన మనస్విని సహా 60 మందిని అరెస్టు చేశారు. కేసు వివరాలను పోలీసు అధికారులు వెల్లడించారు. వారి కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో 'ఎక్సిటో సొల్యూషన్స్' పేరిట మనస్విని కాల్ సెంటర్ ఏర్పాటు చేసింది.



## SLBC టన్నెల్లో మృతదేహాలను గుర్తించేందుకు కేడావర్ డాగ్స్

# 'మేం త్వరలో బిజేపీకి మరో గిఫ్ట్ ఇస్తాం'



**కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి06:**

త్వరలో బీజేపీకి మరో గిఫ్ట్ ఇస్తామని సెటైర్లు వేశారు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు.తాము బీజేపీకి ఎన్నో గిఫ్ట్ లు ఇచ్చిమని, మళ్లీ గిఫ్ట్ ఇస్తామంటూ ఎద్దేవా చేశారు. బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ రంజాన్ గిఫ్ట్ లపై చేసిన వ్యాఖ్యలపై శ్రీధర్ బాబు కౌంటర్‌ఇచ్చారు. ' మేం బీజేపీకి ఎన్నో గిఫ్టులు ఇచ్చాం. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి రంజాన్ గిఫ్ట్ ఇచ్చయా?, మేం కూడా బీజేపీకి త్వరలోనే మరో గిఫ్ట్ ఇస్తాం.బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఒప్పందాలు బయటకి వస్తున్నాయి. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటర్ల తీర్పును గౌరవిస్తున్నాం. నరేందర్ రెడ్డికి ఓటేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. క్రియాశీలకంగా పని చేసిన కార్యకర్తలకు ధన్యవాదాలు. కాంగ్రెస్ అభ్యర్థిని ఓడగొట్టేందుకు బీఆర్ఎస్ బీజేపీ చీకటి ఒప్పందం చేసుకున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్ ల ఫెవికాల్ బంధం గట్టిగా చేసేందుకు చేసిన కృషి అందరూ చూశారు. బీఆర్ఎస్ తమ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టలేదు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్ సింగ్ కి వచ్చిన ఓట్లు ఎన్ని?, తనకి బీఆర్ఎస్ సంపూర్ణ సహకారం ఇచ్చిందని రవీందర్ సింగ్ అన్నాడు. బీజేపీకి తోడుగా బీఆర్ఎస్ నిలబడింది' అని శ్రీధర్ బాబు విమర్శించారు.

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# నిద్రలేచిన 'బోఫోర్స్ స్కాం'



నలభైయ్యేళ్ల క్రితం పుట్టుకొచ్చి, పుష్కరకాలం క్రితం శాశ్వత సమాధి అయిందనుకున్న బోఫోర్స్ కుంభకోణం మళ్లీ ఆవులిస్తోంది. దాన్ని సమాధి చేసేవరకూ ఇంచుమించు ప్రతియేటా ఏదో ఒక కొత్త సంగతితో బయటికొస్తూ, వచ్చినప్పుడల్లా పెను సంచలనానికీ, దుమారానికీ కారణమైన బోఫోర్స్ ఆ రకంగా 'ఎవర్ గ్రీన్'. ప్రత్యేక న్యాయస్థానం జారీ చేసిన అభ్యర్థన పత్రంతో కొన్ని రోజుల క్రితం కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ, అమెరికా న్యాయ విభాగాన్ని సంప్రదించటంతో అది మరోసారి పతాక శీర్షికలకు ఎక్కబోతున్నదని భావించవచ్చు.అప్పట్లో బోఫోర్స్ స్కాంపై దర్యాప్తు చేశామని చెప్పిన అమెరికన్ ప్రైవేటు డిటెక్టివ్ సంస్థ 'ఫెయిర్ ఫాక్స్' నుంచి సమాచారం సేకరించాలన్నది సీబీఐ ప్రధాన ధ్యేయం. వాస్తవానికి ఈ అభ్యర్థన పత్రాన్ని జారీ చేయాల్సిందిగా నిరుడు అక్టోబర్‌లోనే ఢిల్లీలోని ప్రత్యేక న్యాయస్థానాన్ని సీబీఐ ఆశ్రయించిందని చెబుతున్నారు.ఇప్పటికీ ఎవరూ అధిగమించలేని స్థాయిలో 1984 లోక్‌సభ ఎన్నికల్లో తన నేతృత్వంలోని కాంగ్రెస్‌కు 404 స్థానాలు సాధించిపెట్టిన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీని... ఆ తర్వాత మరో మూడేళ్లకు బయట పడిన ఈ కుంభకోణం ఊపిరాడనీయకుండా చేసింది.ఇందులో తనకు లేదా తన కుటుంబ సభ్యు లకు ఎలాంటి ప్రమేయమూ లేదని రాజీ చెప్పిన మాటల్ని జనం విశ్వసించలేదు. 1989 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ సగానికిపైగా స్థానాలు కోల్పోయి ప్రతిపక్షానికి పరిమితమైంది. వీపీ సింగ్ నేతృత్వంలో కొత్తగా ఏర్పడిన నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం 1990లో ఆదేశించే వరకూ నిందితులపై కేసు ల్లేవు. దర్యాప్తు లేదు. అంతవరకూ మన దేశంలో ఎవరికీ పెద్దగా తెలియని స్వీడన్ రేడియో 1987లో బోఫోర్స్ శతఘ్నుల కొనుగోళ్లలో ముడుపులు చేతులు మారాయని తొలిసారి వెల్లడించినప్పుడు మన దేశంలో రాజకీయ ప్రకంపనలు చెలరేగాయి. అటు స్వీడన్‌లోనూ పెను సంచలనం కలిగించాయి.ఈ స్కాంలో మన రాజకీయ నాయకులు, రక్షణ అధికారులతోపాటు కొందరు విదేశీయులు పీకల్లోతు మునిగారని వెల్లడైంది. స్వీడన్ ఆయుధాల సంస్థ ఏబీ బోఫోర్స్ నుంచి నాలుగు వందల 155 ఎంఎం శతఘ్నులు కొనుగోలు చేయటానికి రూ. 1,437 కోట్లతో ఒప్పందం కుదరగా,అందులో రూ. 64 కోట్లు చేతులు మారాయన్నది ప్రధాన ఆరోపణ.ఇందులో ఇటలీ వ్యాపారవేత్త అటావియో కత్రోచి, బోఫోర్స్‌కు ఏజెంట్‌గా వ్యవహరించిన విన్‌చద్దా, పారిశ్రామికవేత్తలు హిందూజా సోదరుల పేర్లు వెల్లడయ్యాయి. 'ది హిందూ' దినపత్రిక జర్నలిస్టు చిత్రా సుబ్రహ్మణ్యం ఈ కుంభ కోణంపై వరసబెట్టి రాసిన కథనాల పరంపరతో కాంగ్రెస్ ఇరకాటంలో పడింది. దీనికి తోడు బోఫోర్స్ సంస్థ ఎండీ మార్టిన్ ఆర్డ్‌బో రాసుకున్న డైరీలోని అంశాలు సైతం బట్టబయలయ్యాయి.దాదాపు పదిహేనేళ్లపాటు దర్యాప్తు పేరుతో సీబీఐ సాగించిందంతా ఒక ప్రహసనం. ఆ తంతు సాగుతుండగానే 1993లో కత్రోచి మన దేశం నుంచి చల్లగా జారుకున్నాడు. అతని బ్యాంకు ఖాతాల విషయమై సమాచారం కావాలంటూ భారత్ నుంచి వచ్చిన అభ్యర్థనను పట్టించుకోవాల్సిన పని లేదంటూ స్విట్జర్లాండ్ విదేశాంగ మంత్రికి అంతకు ఏడాదిముందు... అంటే 1992లో పీవీ నరసింహారావు ప్రభుత్వంలో విదేశాంగ మంత్రిగా ఉన్న మాధవ్‌సిన్హ్ సోలంకీ ఉత్తరం అందజేశారుఇక 2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ఏలుబడి మొదలయ్యాక దర్యాప్తు పూర్తిగా పడకేసింది. ఈ కేసుకు సంబంధించి కొత్త పాత్రధారులు తెరపైకొస్తున్నా, సరికొత్త వివరాలు వెల్లడవుతున్నా పట్టించుకున్న నాథుడే లేడు. ఈలోగా నిందితుల్లో కొందరు మరణించారు. కనీసం బతికున్న కత్రోచి పైన అయినా దర్యాప్తు కొనసాగించమని 2005లో ఢిల్లీ హైకోర్టు చెప్పినా సీబీఐ ముందుకు కదలనే లేదు.వాస్తవానికి అంతకుముందు 2003లో మలేసియాలోనూ, ఆ తర్వాత 2007లో అర్జెంటీనా లోనూ కత్రోచి కదలికలు కనబడినా అరెస్టుకు ప్రయత్నించలేదు. సరిగదా... లండన్‌లోని కత్రోచి ఖాతాలకూ, ముడుపులకూ సంబంధం లేదంటూ ఆ ఖాతాల స్తంభనను రద్దు చేయించి, 2009లో 'వాంటెడ్' జాబితా నుంచి అతని పేరు తొలగింపజేయటంలో సీబీఐ అత్యుత్సాహం ప్రదర్శించింది.నిందితులుగా ఉన్న కత్రోచి, విన్ చద్దాలకు రూ. 41 కోట్లు అందాయని ఆదాయపన్ను విభాగం అప్పిలేట్ ట్రిబ్యునల్ నిర్ధారించి వారిద్దరూ ఆ ఆదాయంపై పన్ను కట్టాల్సిందేనని 2011లో తేల్చి చెప్పింది. వీరిద్దరికీ ఏఈ సర్వీసెస్ నుంచీ, స్వెన్‌స్కా అనే సంస్థ నుంచీ సొమ్ములు బదిలీ అయ్యా యని తెలిపింది. ఆ తర్వాతైనా సీబీఐ చేయాల్సింది చేయలేదు.ట్రిబ్యునల్ ఉత్తర్వులిచ్చిన మర్నాడే కత్రోచిని పట్టుకోవటం మావల్ల కాదని కోర్టులో ఆ సంస్థ చేతులెత్తేసింది. నిందితులందరిపై కేసుల ఉపసంహరణకు అనుమతించమని అది దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రత్యేక కోర్టు అంగీకరించింది. కీలక నిందితుడు కత్రోచి 2013లో మరణించాడు. దీన్ని తిరగదోడేందుకు అనుమతించాలన్న సీబీఐ వినతిని సుప్రీంకోర్టు తీవ్ర జాప్యం చోటుచేసుకుందన్న కారణాన్ని చూపి 2018లో తోసిపుచ్చింది.రాజీవ్ గాంధీకి ఈ ముడుపుల వ్యవహారంతో సంబంధం లేదని 2004లో ఢిల్లీ హైకోర్టు క్లీన్‌చిట్ ఇచ్చింది. కానీ ఆ తర్వాత కాలంలో దర్యాప్తు ఎందుకు నత్తనడకన సాగింది? ఎవరిని కాపాడటానికి ఆ సంస్థ తాపత్రయపడింది? ఒక స్విస్ బ్యాంక్‌లో 'మాంట్ బ్లాంక్' పేరిట ఉన్న ఖాతాలో బోఫోర్స్ ముడుపులున్నాయని తాము కనుగొన్నప్పుడు అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ ఆగ్రహోదగ్రు దయ్యారని 'ఫెయిర్ ఫాక్స్' సారథి మైకేల్ హెర్ష్‌మాన్ 2017లో చెప్పిన మాటల్లో వాస్తవం ఎంత? ఇందులో వెలికితీయాల్సిన చేదు నిజాలు చాలానే ఉన్నాయని ఈ పరిణామాలు చూస్తే అర్థమవు తుంది. ఈసారైనా ఆ పని జరుగుతుందా అనేది వేచిచూడాలి.

# అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్యాయత్నం

మొదటిపేజీ తరువాయి

వీరిలో భర్త మృతి చెందగా భార్య పరిస్థితి విషమంగా ఉంది. మండలంలోని వడూర్‌కు చెందిన ఆడెపు పోశెట్టి(60), ఇందిరా(52) అనే రైతు దంపతులు ఆర్థిక సమస్యల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు.పోశెట్టి మరణించగా భార్య ఇందిరాను చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి దంపతులకు మూడెకరాల భూమి ఉండగా ఇటీవల పత్తి కంది పంటలను సాగు చేశారు. వీరికి రెండు లక్షల 30 వేల వరకు అప్పులు ఉన్నాయి. పంట నష్టంతో పాటు వారికి ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ సైతం మాఫీ కాలేదు. ఇటీవల ఇద్దరు కూతుర్ల వివాహం చేయడంతో పాటు, నూతన గృహం సైతం నిర్మించినట్లు స్థానికులు తెలిపారు.

# అడుగంటుతున్న భూగర్భ జలాలు ఆందోళన చెందుతున్న రైతులు

మొదటిపేజీ తరువాయి

తలాపున పారుతున్న గోదావరి నీ సేను నీ సెలుక ఎడారి అని స్థానిక కవి రచయిత మల్లావజ్జల సదాశివుడు మూడు దశాబ్దాల క్రితం తెలంగాణ సాగు నీటి కష్టాలను ఏకరువు పెట్టగా పదేళ్ల తర్వాత తిరిగి అదే పరిస్థితులు నెలకొనడంతో కాంగ్రెస్ పాలన వచ్చింది కష్టాలను వెంట బెట్టుకొని వచ్చిందనే విధంగా పాలన సాగుతుండటంతో రైతుల్లో అసహనం వ్యక్తం అవుతున్నది. పెద్దపల్లి జిల్లాలోని మంథని, ముత్తారం, పాలకుర్తి, అంతర్గాం, ధర్మారం మండలాల్లో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. 2023 ఫిబ్రవరి నెలలో భూగర్భజలాలు 5.47మీటర్ల లోతులో ఉండగా 2024ఫిబ్రవరి మాసంలో 5.09మీటర్ల లోతులో, 2025 ఫిబ్రవరి మాసంలో 5.44మీటర్ల లోతులోకి పడిపోయాయి. బీఆర్ఎస్ పార్టీతో కక్షతో కాళేశ్వరంను పక్కన పెట్టి తెలంగాణ రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా ముంచుతున్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో మోటార్లతో పని లేకుండానే కాలువల్లో సాగు నీరు పారిందని, కాళేశ్వరం గేట్లు ఎత్తడంతో బోర్లన్నీ ఎత్తిపోయి బోర్లల్లో కూడా చుక్క నీరు రావడం లేదని మూడేళ్ల దాకా ఇక సాగు అంతేనా..? అలాగైతే తాము ఎలా బ్రతుకుతామని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్కవర్గం సంతోషంగా లేరు

మొదటిపేజీ తరువాయి

నిధులు విడుదల చేయకుండా తాత్సారం చేస్తుండడం.. పేద, మధ్యతరగతి విద్యార్థులకు శాపంగా మారుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి రాలేదని, స్కాలర్‌షిప్‌ల బకాయిల విడుదలకు మార్చి వరకు సమయం ఉందని మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారని గుర్తుచేశారు. ఆ మాట చెప్పి మూడు నెలలు పూర్తి కావస్తుందని, ఇప్పటివరకు మూడు రూపాయల బకా యిలు కూడా చెల్లించిన దాఖలు లేవని వెల్లడించారు. రేవంత్ సర్కారుకు బడా కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల చేయడంపై ఉన్న ధ్యాస, పేద విద్యార్థుల చదువులకు బకాయిలు చెల్లించడంపై లేదని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సహా అగ్రవర్ణ పేద విద్యార్థులు విదేశాలకు వెళ్లి, ఉన్నత చదువులు చదవాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రారంభించిన విదేశీ విద్య పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగారుస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు ఒక్క విద్యార్థిని కూడా ఈ పథకం కింద ఎంపిక చేయలేదన్నారు. ఏడాదిన్నరగా ప్రక్రియ దరఖాస్తుల దశలోనే నిలిచిపోయిందని చెప్పారు. కొం దరు దరఖాస్తుదారులు ఇప్పటికే అప్పులు చేసి విదేశీ విద్యకు వెళ్లగా, మరికొందరు ఆర్థిక పరిస్థితులు అనుకూలించక పథకంలో ఎంపిక అవుతామేమో అనే ఆశతో ఇక్కడే ఉండి ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం మొద్దునిద్రను వీడి తక్షణమే స్కాలర్షిప్ బకా యిలను విడుదల చేయాలని, విదేశీ విద్య పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి పేదలకు విదేశాల్లో చదివే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# SLBC టన్నెల్లో మృతదేహాలను గుర్తించేందుకు కేడావర్ డాగ్స్

మొదటిపేజీ తరువాయి

రాాదీజ టన్నెల్లో మృతదేహాలను వెలికితీత ప్రక్రియ వేగవంతం చేశారు అధికారులు. వీలైనంత త్వరగా మృతదేహాలను బయటికి తీసేందుకు కేరళనుంచి ప్రత్యేకంగా 2 ఎయిర్ ఫోర్స్ హెలికాప్టర్లలో 2 కేడావర్ డాగ్స్ ను తీసుకొచ్చారు. IIT నిపుణులతో సాయంతో కృడావర్ డాగ్స్, ఎన్డీఆర్?ఎఫ్, సింగరేణి బృందాలు టన్నెల్ లోపలికి వెళ్లా యి. డిజాస్టర్ మేనేజ్ మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్ నేతృత్వంలో టన్నెల్ చిక్కుకున్న వారిని గుర్తించేందుకు చర్యలు వేగవంతం చేశారు.

వయనాడు ల్యాండ్ స్లైడింగ్ లో కేడావర్ డాగ్స్ ప్రముఖ పాత్ర పోషించాయి. కొండ చెరియల లోపల కురుకపోయిన మృతదేహాల గుర్తించాయి స్పెషల్ డాగ్స్. టన్నెల్ ముందు భాగంలో మట్టిలో కొరుకుపోయిన క్యాబిన్లో కార్మికుల అవశేషాలు గుర్తించేందుకు కేడావర్ డాగ్స్ రంగంలోకి దించారు అధికారులు.ఒక చివరనుంచి మట్టిని మరో చివర నుంచి నీటిని దారి మళ్లిస్తూ ఎన్డీఆర్ ఎఫ్ బృందాలు ముందుకు సాగుతున్నాయి. టన్నెల్ లోపల పనిచేసేవారికి కావలసిన సదుపాయాలు అన్ని ఏర్పాటు చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఎన్.డి.ఆర్.ఎఫ్. అధికారులు, సింగరేణి అధికారులు, ఐ. ఐ టి నిపుణులు తదితరులు కూడా రెస్క్యూ ఆపరేషన్ ను పరిశీలిస్తున్నారు.

# నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి మోసాలు.. 60 మంది అరెస్టు

మొదటిపేజీ తరువాయి

గుజరాత్‌కు చెందిన మనస్విని సహా 60 మందిని అరెస్టు చేశారు. కేసు వివరాలను పోలీసు అధికారులు వెల్లడించారు. వారి కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో 'ఎక్సిటో సొల్యూషన్స్' పేరిట మనస్విని కాల్ సెంటర్ ఏర్పాటు చేసింది. కైవాన్ పటేల్, ప్రతీక్, రాహుల్ అనే వ్యక్తులతో కలిసి దీన్ని నిర్వహిస్తోంది.

పలువురు ఈశాన్య రాష్ట్రాల వ్యక్తులను ఆమె టెలీకాలర్లుగా నియమించుకుంది. అమెరికన్లే ప్రధాన లక్ష్యంగా నిందితులు మోసాలకు పాల్పడుతున్నారు. వీరి నుంచి పోలీసులు 63 ల్యాప్‌టాప్‌లు, 52 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హ్యాక్ అయిన బ్యాంకు ఖాతాలు సరిచేస్తామంటూ వీరు మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంకు ఖాతా, డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలు సేకరించి నగదు కాజేస్తున్నారు.

# ఈఏపీసెట్‌కు భారీగా దరఖాస్తులు

**ఐదు రోజుల్లోనే దాదాపు 48,158 మంది అభ్యర్థుల దరఖాస్తుల సమర్పణ**

**హైదరాబాద్,మార్చి6 :**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2025–26 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్, అగ్రికల్చర్–ఫార్మా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించనున్న ఈఏపీసెట్ 2025కు గత శనివారం నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమైన సంగతి తెలిసిందే. మార్చి 1వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. అయితే కేవలం ఐదు రోజుల్లోనే ఊహించని రీతిలో దరఖాస్తులు వచ్చాయి. దాదాపు 48,158 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఈఏపీసెట్ కో కన్వీనర్ ఆచార్య కె.విజయకుమార్ రెడ్డి తెలిపారు. వీరిలో 31,805 మంది ఇంజినీరింగ్, 16,317 మంది అగ్రికల్చర్–ఫార్మసీ, మరో 36 మంది రెండు విభాగాల పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కాగా ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 4, 2025వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. రూ.2,500, రూ.5 వేల ఆలస్య రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకున్నవారికి హైదరాబాద్‌లోని జోన్ 4లో మాత్రమే పరీక్షా కేంద్రాలు కేటాయిస్తారని ఇప్పటికే నోటిఫికేషన్‌లో ఉన్నత విద్యాశాఖ స్పష్టం చేసింది. ఆన్‌లైన్ దరఖాస్తుల సవరణలకు ఏప్రిల్ 6 నుంచి 8 వరకు అవకాశం ఉంటుంది. రూ.250 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 9వరకు, రూ.500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 14 వరకు, రూ.2,500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 18 వరకు, రూ.5 వేల ఆలస్య రుసుముతో ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థులకు తప్పనిసరిగా 2025 డిసెంబరు 31 నాటికి 16 సంవత్సరాల వయసు నిండి ఉండాలి. గరిష్ఠ వయో పరిమితి అంటూ ఏమీ లేదు. ఇక బీటెక్ డెయిరీ టెక్నాలజీ, అగ్రికల్చర్ ఇంజినీరింగ్, ఫుడ్ టెక్నాలజీతోపాటు బీఎస్సీ అగ్రికల్చర్, వెటర్నరీ సైన్స్, హార్టికల్చర్ కోర్సులకు 2025 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సుల్లో చేరేందుకు ఎస్సీ, ఎస్టీలకు 25, ఇతరులకు 22 సంవత్సరాలు గరిష్ఠ వయోపరిమితి నిర్ణయించారు. మే 2 నుంచి 5 వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అలాగే ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా పరీక్షలు నిర్వహించనున్నారు. మరోవైపు ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏపీలోని విజయవాడ, కర్నూలు పరీక్ష కేంద్రాలను రద్దు చేస్తూ ఇప్పటికే ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. 15 శాతం నాన్ లోకల్ కోటాలో ప్రవేశాలు పొందేందుకు ఏపీ విద్యార్థులకు ఇకపై అనుమతి లేదని తేల్చి చెప్పింది.

# అసత్య ప్రచారాలు చేస్తూ పరువునష్టం కేసు వేస్తాం : టీజీపీఎస్సీ

**హైదరాబాద్,మార్చి6 :**

తెలంగాణ పబ్లిక్ కమీషన్ (టీజీపీఎస్సీ) మొత్తం 563 గ్రూప్ 1 పోస్టుల భర్తీకి సంబంధించి గతేడాది గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు అక్టోబర్ 21వ తేదీ నుంచి అక్టోబర్ 27వ తేదీ వరకు మొత్తం 7 పేపర్లకు రాష్ట్ర వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు మొత్తం 31,383 మంది క్వాలిఫై అవగా కేవలం 21,093 మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. అంటే 67.17 శాతం మాత్రమే పరీక్ష రాశారన్నమాట. దీని ప్రకారం ఒక్కో పోస్టుకు దాదాపు 38 మంది పోటీపడుతున్నారు. మరోవైపు గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాల వెల్లడికి ప్రభుత్వం చకచకా ఏర్పాట్లు చేస్తుంది. అయితే తాజాగా గ్రూప్ 1 ఉద్యోగాలపై కొందరు వ్యక్తులు తప్పుడు వార్తలను సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. తాజాగా వీటిపై స్పందించిన టీజీపీఎస్సీ ఆ వార్తలను ఖండించింది. సోషల్ మీడియాలో జరుగుతోన్న అసత్య ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పరువునష్టం దావా వేస్తామంటూ కమిషన్ ప్రకటించింది. అతి త్వరలోనే గ్రూప్ 1 ఫలితాలు వెల్లడిస్తామని స్పష్టం చేసింది. మార్కుల జాబితాను వెబ్‌సైట్‌లో పెడతామని.. అభ్యర్థుల లాగిన్‌లో పేపర్ల వారీగా మార్కులు చేసుకోవచ్చని పేర్కొంది. అంతేకాకుండా గ్రూప్ 1 నియామక ప్రక్రియ పారదర్శకంగానే జరుగుతోందని, ఎలాంటి తప్పులు జరగకుండా చర్యలు తీసుకున్నామనీ పేర్కొంది. సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారాలను అభ్యర్థులు నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. టీజీపీఎస్సీ గ్రూప్ -1 పోస్టుల అమ్మకమంటూ సోషల్‌మీడియాలో గత కొన్ని రోజులుగా జోరుగా ప్రచారం జరగడంతో టీజీపీఎస్సీ స్పందించింది. తప్పుదోవ పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న వారిపై మార్చి 5 బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అలాగే సైబర్ క్రైమ్స్ డీసీపీకి సైతం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. గ్రూప్ 1 ఆశావాహుల్లో అపోహలు, గందరగోళం సృష్టించేందుకు నకిలీ వార్తలను ప్రచారం చేస్తున్న వారిపై క్రిమినల్ పరువునష్టం దావా వేసినట్టు కమిషన్ ఇన్‌చార్జి కార్యదర్శి సుమతి తెలిపారు. గ్రూప్1 ఫలితాలను పారదర్శకంగా ప్రాసెస్ చేస్తున్నామని, ఏ అభ్యర్థికీ అన్యాయం జరగదని హామీ ఇచ్చారు.

## ఎమ్మెల్సీల గెలుపుతో సంబరాలు జరుపుకున్న భాజపా శ్రేణులు



**కబురు న్యూస్ మద్నూర్, మార్చి 6**
పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా చిన్న మైల్ అంజిరెడ్డి గెలుపొందడంతో మద్నూర్ మండల కేంద్రంలో బిజెపి నాయకులు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అరుణాతారా మాట్లాడుతూ ఎమ్మెల్సీల అభ్యర్థుల గెలుపుతో భాజపా శ్రేణులలో నూతన ఉత్తేజం నెలకొన్నదని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం భాజపా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసి బిజెపి జెండా ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తుకారం, పండిత్ రావు, కృష్ణ, సంతోష్, బాల్ కిషన్,శివాజీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా పోరాట దినం పోస్టర్ల ఆవిష్కరణ...

**కబురు న్యూస్,బోధన్ మార్చి 06..**
పట్టణంలోని రాకాసిపేట్ లో పిఓడబ్ల్యూ ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఓడబ్ల్యూ పట్టణ అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా పోరాట దినం ఆవిర్భవించి నేటికి 144 సంవత్సరాల అయిందని తెలిపారు. పనిగంటల తగ్గింపుకై, పని స్థలాల్లో కనీస వసతుల కోసం, మెరుగైన వేతనాలు కావాలని, ఓటు హక్కు కోసం 1850 దశకం తర్వాత కాలంలో మహిళలు పోరాటాల బాట పట్టారని గుర్తు చేశారు. దీనిలో భాగంగా న్యూయార్క్ నగరంలో కుట్టు పని చేసే వేలాది మంది మహిళలు ఉద్యమించారని, కానీ ఈ ఉద్యమాన్ని యజమాన్యాలు నాటి పాలకులు నిరంకుశంగా అణిచివేశారని, ఆనాడు ఎంతోమంది



మహిళలు వీర మరణం పొందారని తెలిపారు. మహిళలు తమ రక్తాన్ని చిందించి హక్కులు సాధించుకున్న రోజును అంతర్జాతీయ మహిళా పోరాట దినంగా జరపాలని జర్మన్ కమ్యూనిస్టు పార్టీ నాయకురాలు క్లారాజట్కిన్ 1910 సంవత్సరంలో కోపెన్ హెగన్ లో జరిగిన రెండవ ఇంటర్నేషనల్ మహాసభలో ప్రతిపాదించగా ఆమోదించారని, నాటి నుండి నేటి వరకు మహిళలపై జరుగుతున్న అణిచివేత, వివక్షతకూ, అసమానత్వానికి వ్యతిరేకంగా తమ హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నారని అయినప్పటికీ నేటి సమాజంలో మహిళలపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయీ కానీ, తగ్గలేదని హత్యలు, అత్యాచారాలు నిత్యకృత్యం అయ్యాయని ఐదు సంవత్సరాల పసిపాపల నుండి పండు ముసలి వరకు ఎవరికీ రక్షణ లేదని మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు నామమాత్రంగా మారాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రెహానా బేగం,ఆర్. లక్ష్మి, కే. పద్మ, బి. యాదమ్మ, ఎస్. పోశవ్వ, అరుగొండ లతా, బి. సుజాత, కమల, బేతి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతపై అవగాహన...

**కబురు న్యూస్,బోధన్ మార్చి 06..**
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మాసింగ్ ఆధ్వర్యంలో చైల్డ్ కమిటీ బృందం పట్టణంలోని ఎస్టీ బాలికల కళాశాల వసతిగృహాన్ని సందర్శించారు. బాల్య వివాహాలు, బాల కార్మికుల నిర్మూలన, వృద్ధుల, 8వ తరగతి నుండి ఇంటర్ వరకు చదివే బడి మానేసిన విద్యార్థులు ఎందుకు మానేశారోనని ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లను అడిగారు. శుభ్రంగా ఉండాలని, లేనిచో అనారోగ్యాలు వస్తాయన్నారు. పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. భయం







లేకుండా పరీక్షలు రాయాలని విద్యార్థినిలకు ధైర్యాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో రమణ రెడ్డి, కళ్యాణి, సుజాత తదితరులు ఉన్నారు.

## తాడ్కోల్ గ్రామాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్ కిరణ్మయి





**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 06**
గ్రామాలలో పచ్చదనం పరిశుభ్రతతో పాటు ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు పంచాయతీ అధికారులు కృషి చేయాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. గురువారం బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామంలోని పల్లె దవఖాన, నర్సరీ, అంగన్వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య ఉప కేంద్రంలో ప్రజలకు అందుతున్న



వైద్య సేవలను ఆమె తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వేసవి కాల దృష్ట్యా గ్రామాలలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా చూడాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అంగన్వాడి కేంద్రాలలో గర్భిణీలు బాలింతలకు అందుతున్న పౌష్టిక ఆహారాన్ని ఆమె గర్భిణీలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బషరుద్దిన్, ఎంపీఓ సత్యనారాయణరెడ్డి, గంగాధర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, రాజు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కార్యకర్తలకు గెలుపు... రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి

**కబురు న్యూస్ ఎల్లారెడ్డి 06**
ఉమ్మడి నిజామాబాద్ కరీంనగర్ మెదక్ అదిలాబాద్ పట్టభద్రుల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన అంజిరెడ్డి ఘనవిజయం సాధించడం కార్యకర్తల జరిగిందని బిజెపి రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి స్థానిక బిజెపి నాయకులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కొమరయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డిలలో గెలిపించేందుకు కృషి చేసిన కార్యకర్తలకు ఓటర్లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు



తెలియజేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ మండల స్థాయిలో బిజెపి జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రభుత్వం



అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచి పార్టీ బలపరిచిన అభ్యర్థులకు గెలుపు కోసం కృషి చేయాలన్నారు..ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల అధ్యక్షులు నర్సింలు, రాజేష్, క్రాంతి కుమార్, నరేష్ నాయక్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## కామారెడ్డిలో ఘనంగా సంబరాలు జరుపుకున్న భాజపా శ్రేణులు



**కబురు న్యూస్ కామారెడ్డి మార్చి 06**
కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి ఘనవిజయం సాధించినందుకుగాను ఎమ్మెల్యే తాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు భాజపా నాయకులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగిన భాజపా పార్టీ అభ్యర్థులు గెలిచేందుకు ఎమ్మెల్సీ ఎన్నికైన అభ్యర్థులే నిదర్శనమని, వారి గెలుపు స్ఫూర్తిగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు కార్యకర్తలు క్షేత్రస్థాయిలో మరింత ఉత్సాహంతో పనిచేసి మరింత ఉత్సాహంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజపా జెండా ఎగరవేస్తామన్నారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన నరేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విపుల్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ నాయకులు శ్రీనివాస్, నరేందర్, శ్రీధర్ రెడ్డి, రవీందర్, విజయ్, రఘు, ప్రతాప్, భూమేష్, ప్రవీణ్, శ్రీకాంత్, గోవర్ధన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## విజయోత్సవ సంబరాలు...



**కబురు న్యూస్,బోధన్ మార్చి 06..**
బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామంలో బీజేపీ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. మెదక్,కరీంనగర్,అదిలాబాద్,నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ పార్టీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ పార్టీ అభ్యర్థి మల్క కొమురయ్య లు విజయం సాధించిన సందర్భంగా గురువారం గ్రామ కూడలిలో బాణా సంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలి... తుల శ్రీనివాస్

**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 06**
బాన్సువాడ మున్సిపాలిటీ అభివృద్ధికి పట్టణ ప్రజలు తమ ఇంటి పనులను సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ అధికారి తులా శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలో ఇంటి పన్ను స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టి పన్ను వసూలు చేశారు.. ఈ



కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడలో పోలీస్ కవాతు నిర్వహించిన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్





**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 06**
బాన్సువాడ పట్టణంలో గురువారం పోలీస్ స్టేషన్ నుండి జెండా గల్లి, బండగల్లి పలు కాలనీలు,ప్రధాన రహదారి గుండా రాపిడ్ యాక్షన్ ఫోర్స్ పోలీసులు పట్టణంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ ఎ ఎఫ్ డి.ఎస్.పి బగేల్ మాట్లాడుతూ ప్రజలకు తాము ఉన్నామని నమ్మకంతో కవాతు నిర్వహించడం జరుగుతుందని, ప్రజలకు అండగా పోలీసులు ఎల్లప్పుడూ తోడుగా ఉంటారన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు అనునిత్యం పర్యవేక్షిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఎస్సైలు అశోక్, మోహన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కబురు తెలుగు దినపత్రిక
KABURU TELUGU DAILY
శుక్రవారం మార్చి 07 2025

# సుదర్శన్ రెడ్డి అంటేనే అభివృద్ధి

**- నిజామాబాద్ జిల్లా అభివృద్ధి ప్రదాత సుదర్శన్ రెడ్డి...**
**- దిగజారుడు మాటలతో ఎంపీ పదవిని అపహాస్యం చేస్తున్న ఫేక్ డిగ్రీ అరవింద్...**
**- ఎన్ఎస్ యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరదబట్టు వేణు రాజ్...**



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,మార్చి 06 :** నిజామాబాద్ జిలాల్లో తెలంగాణ యూనివర్సిటీ,త్రిబుల్ ఐటీ కాలేజ్ బాసర్,మెడికల్ కాలేజ్, ప్రభుత్వ ఆసుపత్రి అనేక అభివృద్ధి పథకాలను అందించింది నిజామాబాద్ జిల్లా అభివృద్ధి ప్రదాతగా మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి నిలిచారని ఎన్ఎస్ యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరదబట్టు వేణు రాజ్ అన్నారు.గురువారం జిల్లా కాంగ్రెస్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి,నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పైన బిజెపి నాయకుడు నిజామాబాద్ ఎంపీ అరవింద్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు.జవహర్ నవోదయ మంజూరు విషయమై మా ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి,భూపతిరెడ్డిపై దిగజారుడు మాటలు మాట్లాడిన నిజామాబాద్ ఎంపీ అరవింద్ పార్లమెంట్ సభ్యుడు అనే విషయం మర్చిపోయి సభ్యత సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని బాధ్యతాయుతమైన పదవిలో ఉండి పెద్దలను ఎలాగా గౌరవించాలి తెలియని సంస్కారహీనుడు ఎంపీ అరవింద్ అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎంపీ అరవింద్ లాగా ప్రజలకు తప్పుడు హామీలు ఇచ్చి ఫేక్ ఫేక్ డిగ్రీలతో గెలిచే నాయకుడు సుదర్శన్ రెడ్డి కాదని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజల గుండెల్లో అభివృద్ధి ప్రదాతగా పేరు సంపాదించుకున్న వ్యక్తి సుదర్శన్ రెడ్డని ఆయన అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్నప్పుడు జిల్లా అభివృద్ధి కోసం అనేక రకాల ప్రాజెక్టులను తీసుకురావడం జరిగిందని,మీరు మాత్రం ఎంపీగా గెలిచి పెద్దపల్లి నిజామాబాద్ రైల్వే లైన్ తోపాటు మాధవ నగర్ బ్రిడ్జి,మామిడిపల్లి బ్రిడ్జిలను ఏళ్ల తరబడిగా పెండింగ్ లో పెట్టారని కొన్ని ఏళ్లుగా వాటి పనులు ఇంకా పూర్తి కాకపోవడం ఎంపీ అరవింద్ చేతగానితనానికి నిదర్శనం అని ఆయన అన్నారు.బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎలాగైతే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ ప్రక్షాళన, హైడ్రా, ఇతర ప్రాజెక్టులకు అడ్డు పుల్ల వేస్తున్నారని ప్రజలు గ్రహించడంతో దిక్కుతోచని స్థితిలో బిజెపి రాష్ట్ర నాయకత్వం జిల్లాలో ఆయా ఎమ్మెల్యేల పై విష ప్రచారం చేయాలని వారి ఎంపీలను ఎమ్మెల్యేలను నాయకులను ఆదేశించిందని అందులో భాగంగానే ఎంపీ అరవింద్ సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి ని టార్గెట్ చేశారని జవహర్ నవోదయ జిల్లాకు మంజూరు చేసినట్టే చేసి దానిని కాంగ్రెస్ నాయకులు కావాలని దానిని అడ్డుకుంటున్నారని విష ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారని కానీ అభివృద్ధికి అడ్డుపడే వ్యక్తి సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి కాదని అలాంటి నీచ సంస్కృతి కిషన్ రెడ్డిది, బిజెపి పార్టీ ది అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరందీప్, కాంగ్రెస్ నాయకులు కిరణ్ రెడ్డి,ఎన్ ఎస్ యు ఐ నాయకులు శివ. సాయికిరణ్, హరీష్, నరందీప్, సందీప్ ,కౌశిక్, అభిలాష్, రాహుల్, జాన్, రేవంత్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలో ఒకరిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు

**- 420 మంది విద్యార్థులు గైర్హాజరు...**

**కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,మార్చ్ 06 :** ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారం రెండవ సంవత్సరం తెలుగు,హిందీ,సంస్కృతం,ఉర్దూ భాష సబ్జెక్టతో పరీక్ష లు ప్రారంభమయ్యాయని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలియజేశారు.420 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా ఒక విద్యార్థి చీటీలు రాయగా పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశామని అన్నారు.మొత్తం జిల్లాలో 16,343 మంది విద్యార్థులకు గాను15,923 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలియజేశారు.మొత్తం 97.4 శాతం విద్యార్థులు పరీక్షలు రాయగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించామని తెలియజేశారు.జిల్లా కలెక్టర్ ధర్మారంలోని సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాల తనిఖీ చేసి పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు.జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను 49 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు.నిజామాబాద్ ఖిల్లా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల -బీ సెంటర్ లో ఓ విద్యార్థి చీటీలు రాస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసింది. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులతో పాటు తాను ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ లు,హై పవర్ కమిటీ, బల్క్ అధికారి, కస్టోడియన్లు తనిఖీ చేసి పర్యవేక్షణ చేసారని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలియజేశారు. జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ నిజామాబాద్ పట్టణంలోని ఖిల్లా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఏ సెంటర్,బి సెంటర్, నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, కంటేశ్వర్ లోని ఎస్సార్ జూనియర్ కళాశాలలను,రవి కాకతీయ జూనియర్ కళాశాల ఏ సెంటర్,బీ సెంటర్,మహిళా కాకతీయ జూనియర్ కళాశాలలను తనిఖీ చేసి సమీక్షించారు.పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజీయుదిన్ అస్లాం,కనకమహాలక్ష్మి పది పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా హై పవర్ కమిటీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో నాలుగు పరీక్ష కేంద్రాలను,మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నర్సయ్య, బాలాజీ, యమున బృందం 19 పరీక్ష కేంద్రాలను, సిటింగ్ స్కాడ్ బృందాలు ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. బల్క్ అధికారి బుద్ధిరాజ్ మూడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు.కాగా నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు.

# బీర్కుర్ లో సంబరాలు జరుపుకున్న బాజాప శ్రేణులు



**కబురు న్యూస్ బీర్కుర్ మార్చి 06** పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి గెలుపొందడంతో గురువారం బీర్కూరు మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు సాయి కిరణ్ ఆధ్వర్యంలో టపాకాయలు కాల్చి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు సాయికిరణ్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా కలిసి పనిచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాయికిరణ్, నాయకులు శ్రీనివాస్,యోగేష్, పోచగొండ ,సాయిలు,రాము బీరుగొండ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ 9వ వర్ధంతి సభను జయప్రదం చేయండి

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,మార్చి 06 :** మార్చి 9న ఖమ్మంలో జరిగే కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ 9వ వర్ధంతిసభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని కోటగల్లిలోని ఎన్.ఆర్ భవన్ లో వర్ధంతిసభ పోస్టర్లను విష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ భారత విప్లవోద్యమంలో 50 సంవత్సరాలు అజ్ఞాత జీవితం గడిపి,అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించిన ఘనత కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న)కు ఉందన్నారు. కామ్రేడ్ రవన్న సుదీర్ఘకాలం ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశాడన్నారు. గోదావరి లోయ పరివాహక ప్రాంతంలో లక్షలాది ఎకరాల పోడు భూములను గిరిజనులు,నిరుపేద గిరిజనేతరకు సాధించడంలో రవన్న పాత్ర క్రియాశీలకమైందన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించడంలో కామ్రేడ్ రవన్న మార్గదర్శకత్వం అపూర్వమైందన్నారు. రష్యా తరహా పెట్టుబడిదారీ దేశంగా మన దేశముందని ,భారతదేశంలో విప్లవం విజయవంతం కావాలంటే ఈ మారిన పరిస్థితి అనుగుణంగా పార్టీ కార్యక్రమం,పంథా,నిబంధనావలిని మార్చుకోవాలని సిద్ధాంతికరించిన నాయకుడన్నారు. భారతదేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా వర్గ పోరాటాలను ఉధృతం చేయాలని ఆశించారని,తద్వారానే విప్లవం విజయవంతం అవుతుందని కామ్రేడ్ రవన్న సిద్ధాంతికరించారన్నారు. నేడు దేశంలో మనవాద,మతోన్మాద ఫాసిజం అత్యంత ప్రమాదంగా మారిన నేపథ్యంలో శ్రామిక,కష్టజీవుల సమైక్య,బలమైన ఉద్యమ నిర్మాణాలు అత్యంత ఆవశ్యకమన్నారు. కామ్రేడ్ రవన్న 9వ వర్ధంతి సభను పార్టీ రాష్ట్ర కమిటీ



ఆధ్వర్యంలో ఈ నెల 9న ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామన్నారు. కామ్రేడ్ రవన్న వర్ధంతి సభను విప్లవాభిమానులు, పార్టీ శ్రేణులు,ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న,సహాయ కార్యదర్శి సాయన్న,పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కె.సంధ్యారాణి,నాయకులు అమూల్య,లలిత,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

20

# ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుతో సంబరాలు జరుపుకున్న భాజపా శ్రేణులు



**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 06** పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుపొందడంతో గురువారం బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, తడుకోలు చౌరస్తాలో బిజెపి నాయకులు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ బిజెపి బలపరిచిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు కొమురయ్య,అంజిరెడ్డిల గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరవేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, శంకర్ గౌడ్,చిదుర సాకార్యకర్తలు గంగారెడ్డి, శ్రీనివాస్, చిరంజీవి, సాయి రెడ్డి, ఉమేష్ నాగరాజు, సంతోష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బేతిగల్లో బ్రహ్మ ముహూర్తంలో గ్రామ దేవతల ప్రతిష్టాపన మహోత్సవం..

**- వైభవంగా సాగిన పోచమ్మ బోనాలు..**

**కబురు న్యూస్, వీణవంక, మార్చి 6.** వీణవంక మండలంలోని బేతిగల్ లో నాలుగు రోజులుగా జరుగుతున్న భూలక్ష్మి మహలక్ష్మి బొడ్రాయి పోచమ్మ ప్రతిష్టాన పండగ గురువారంతో ముగిసింది. అష్టదిక్పాలకులు దద్దరిలేలా, కోటి దేవతల అనుగ్రహ ఆశీర్వాదంతో, బ్రహ్మ ముహూర్తాన,ఉదయం నాలుగు గంటల సమయం లోనే అర్చకులు నరసింహచర్యులు ఆధ్వర్యంలో విగ్రహాలు ప్రతిష్టాపన చేశారు. అంతరం భూలక్ష్మి మహలక్ష్మి బొడ్రాయి పూజ చేశారు.మహిళలు మంగళహారతిలతో వచ్చి యాగశాలా, గ్రామదేవతలైన బొడ్రాయి, భూలక్ష్మి, మహాలక్ష్మికు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు బేతిగల్ ఊరు వడ వాడల్లో నుంచి



బోనాలతో పంబాల డప్పు సాప్పులతో అట పాటలలో తరలి వెళ్లారు.. పోచమ్మ తల్లి ఆలయలంలో మహిళలు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు పోచమ్మ ఆలయంలో పంబాల వాళ్లు కథ చెప్పి గావు పట్టారు.వీణవంక మండల బేతిగల్ గ్రామంలో భూలక్ష్మి మహాలక్ష్మి బొడ్రాయి పోచమ్మ ప్రతిష్టానపనకు హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ బాబు హాజరు అయ్యారు. ఈ సందర్భాంగా 2 లక్షల 116 రూ విరాళంగా ఇచ్చారు. గ్రామస్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రణవ్ బాబు ను శాలువా కప్పి,ఘనంగా సన్మాంచించారు..ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గంగాడి తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి,అతిధి బిల్డర్ అధినేత కొమ్మిడి రాకేష్ రెడ్డి, సాహెబ్ హుస్సేన్,పోతరవేన సతీష్ కుమార్, సమ్మిరెడ్డి, శ్రీపాల్ రెడ్డి,మద్దుల ప్రశాంత్ పటిల్, శ్రవణ్, విద్యాసాగర్, గ్రామ శాఖ అధ్యక్షులు మడ్డి అనిల్, మాసడి చొక్కారావు, మడ్డి రజినీకాంత్, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైల్వే ట్రాక్ దాటుతూ వ్యక్తి మృతి

**కబురు న్యూస్,నిజామాబాద్ రైల్వే,మార్చి 06 :** రైల్వే ట్రాక్ దాటుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు.ఈ ఘటన నగరంలోని పూలాంగ్ అన్ వాగు బ్రిడ్జి వద్ద చోటు చేసుకుందని రైల్వే పోలీసులు తెలిపారు.ఎల్లమ్మగుట్టకుచెందిన బొందెలు ప్రతాప్ సింగ్ అనే వ్యక్తి గురువారం ఉదయం 7.30గంటలకు పూలాంగ్ రైల్వే బ్రిడ్జి వద్ద పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది.ఈ ఘటనలో ప్రతాప్ సింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు.నిజామాబాద్ స్టేషన్ మాస్టర్ హరి కృష్ణ ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఎంపీ అరవింద్ దిష్టి బొమ్మ దగ్ధం...



**కబురు న్యూస్,బోధన్ మార్చి 06..**
బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ని విమర్శించడం సరికాదని నిజామాబాద్ ఎంపీ అరవింద్ తీరుపై కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ ఎంపీ అరవింద్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ మాట్లాడారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ పై విమర్శలు గుప్పిస్తూ ఆయన తీరును తప్పుబట్టారు. వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని హెచ్చరించారు. వెంటనే ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండలాల అధ్యక్షులు పాషా, నాగేశ్వర్ రావు, రవి, నాయకులు దాము, హరికాంత్ చారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమిష్టి కృషితోనే బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు

**- ఇదే స్ఫూర్తితో స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం...**
**- బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి...**



**కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,మార్చి 05 :**
ఎమ్మెల్సీ ఎన్నికలలో బూత్ కార్యకర్తలు,నాయకులు,ప్రతి ఒక్కరు సమిష్టిగా కృషి చేయడం వల్లే గెలుపు సాధ్యమైందని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి అన్నారు.బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం స్థానిక సంస్థల ఎన్నికలకు పునాది కానుందన్నారు.కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం పైన విశ్వాసంతో ఇందూరు జిల్లా నుంచి అత్యధిక మెజార్టీ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఇదే స్ఫూర్తి తో రాబోయే ఎన్నికలలో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.మమ్మల్ని ప్రతి రోజు ఎంపీ అర్వింద్,ఎమ్మెల్యేలు ధన్ పాల్ సూర్యనారాయణ,రాకేష్ రెడ్డి ఎప్పటికప్పుడు పార్టీ పనులను పర్యవేక్షించి ఈ గెలుపులో కీలకంగా పనిచేయడం జరిగిందన్నారు.ఈ గెలుపులో అర్వింద్ ధర్మపురి కృషి మరువలేనిదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని ఆ పార్టీ నాయకులే డబ్బుల కోసం ఎంత హింసించారో నిన్నటి వీడియోతో అర్థం అయిందన్నారు.కేంద్రంలో అభివృద్ధి పనులతో రాష్ట్రం లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.నిజామాబాద్ జిల్లా నరేంద్ర మోదీ అడ్డా అని మరోసారి రుజువైందన్నారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు అభివృద్ధి మీద దృష్టి పెట్టి పని చేయాలనీ హితవు పలికారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయ డంక మోగిస్తుందన్నారు.ఇదే విధమైన పని తీరు తో మా కార్యకర్తలం కలిసికట్టుగా పనిచేస్తామని అన్నారు.ప్రజలు బీజేపీ ని నమ్ముతున్నారని తెలంగాణ గడ్డ మీద కమలం జెండా ఎగురేస్తామని అన్నారు.ఈ కార్యక్రమం లో బీజేపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతి రెడ్డి,పోతనకర్ లక్ష్మి నారాయణ,జిల్లా అధికార ప్రతినిధి బుసాపూర్ శంకర్,రూరల్ కన్వీనర్ పద్మారెడ్డి, జిల్లా కార్యాలయ కార్యదర్శి బద్దం కిషన్, కార్పొరేటర్లు మెట్టు విజయ్,మండల అధ్యక్షులు గడ్డం రాజు,ఇప్పకాయల కిషోర్,ఆనంద్ రావు,మల్లేష్ గుప్తా,బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యాదల నరేష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అమందు విజయ్ కృష్ణ,బీజేవైఎం నాయకులు వినోద్ రెడ్డి,దేవా నాయక్,నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కూతురి వివాహానికి హాజరైన పార్టీ ఇంచార్జ్ ఏనుగు



**కబురు న్యూస్ హైదరాబాద్, మార్చి 06**
దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కూతురి వివాహానికి హైదరాబాదులో గురువారం టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి పార్టీ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేంద్ర పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మారం సోషల్ వెల్ఫేర్ కళాశాలను సందర్శించిన కలెక్టర్







**- ఇంటర్ పరీక్షా కేంద్రం తనిఖీ...**

**కబురు న్యూస్,నిజామాబాద్,మార్చి 06 :**
డిచ్పల్లి మండలం ధర్మారం గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం సందర్శించారు.కళాశాలలోని కిచెన్, డైనింగ్ హాల్,క్లాస్ రూమ్ లు, డార్మెటరీ, స్టోర్ రూంలను పరిశీలించారు.విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. కిచెన్, డైనింగ్ హాల్, డార్మెటరీ, స్టోర్ రూంలను సందర్శించి, బియ్యం నిల్వలు, కూరగాయల నాణ్యతను, సరుకుల స్టాక్ ను పరిశీలించారు. వంట నూనె, పాలు, పండ్లు, కోడిగుడ్ల నాణ్యత పరిశీలించిన కలెక్టర్, కాల పరిమితి ముగిసిన వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదని నిర్వాహకులకు సూచించారు. నాణ్యతా లేమితో కూడిన నాసిరకం బియ్యం, ఇతర ఏవైనా సరుకులు పాఠశాలకు కేటాయించబడిన సందర్భాల్లో మండల అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.



పాఠశాల సముదాయాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మెనూ పట్టికను పరిశీలించి, విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఇంటర్ పరీక్షలు ఇప్పటికే ప్రారంభం అవగా, త్వరలో జరిగే టెన్త్ క్లాస్ వార్షిక పరీక్షల కోసం పదవ తరగతి బాలికలకు పునఃశ్చరణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు తక్షణమే పనులు జరిపిస్తామని అన్నారు.అంతకుముందు కలెక్టర్ రెసిడెన్షియల్ స్కూల్ లో కొనసాగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా గదులను సందర్శించి, పరీక్షల నిర్వహణ తీరుతెన్నులను,సీ.సీ కెమెరాల పనితీరును పరిశీలించారు. కాపీయింగ్ కు అవకాశం లేకుండా గట్టి నిఘా నడుమ పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సెల్ ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి అనుమతించకూడదని సూచించారు.కలెక్టర్ వెంట పాఠశాల ప్రిన్సిపల్ మాధవీలత, స్థానిక అధికారులు ఉన్నారు.

# శుభకార్యానికి హాజరైన పార్టీ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి



**కబురు న్యూస్ బాన్సువాడ, మార్చి 06**
వర్ని మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ మేక వీర్రాజు మనవడి నూతన వస్త్రధారణ కార్యక్రమానికి గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి హాజరై ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు యలమంచిలి శ్రీనివాసరావు, మాలెపు వెంకట్ రెడ్డి, మంత్రి గణేష్ , భాను గౌడ్, సంజీవులు, నరేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల సంబరాలు

**కబురు న్యూస్,నిజామాబాద్ లీగల్, మార్చి 05 :**
కరీంనగర్,నిజామాబాద్,అదిలాబాద్,మెదక్ జిల్లాల ఉపాధ్యాయ నియోజవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్కా కొమురయ్య,పట్టభద్రుల నియోజకవర్గంలో ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమలై అంజిరెడ్డి గెలుపొందిన నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా బీజేపీ లీగల్ సెల్,న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో జిల్లాకోర్టు చౌరస్తాలో టపాకాయలు కాల్చి,మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా పరిషత్ జిల్లా అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యయ నిరుద్యోగ యువత పట్ల నిర్లక్ష్య వైఖరికి నిరసన వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉత్తర తెలంగాణ ప్రజలు తీర్పునిచ్చి



భాజపా పై విశ్వాసం తెలియజేశారని అన్నారు.దేశ వ్యాప్తంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో అమలవుతున్న ప్రగతి పథకాలు ప్రజలకు చేరువవతున్న తీరుకు స్పందించిన ప్రజలు భాజపా కు అనుకూలంగా సంఘటితం అవుతున్నారని తెలిపారు. తెలంగాణలో ప్రజలు భాజపా పట్ల విశ్వాసాన్ని చూపారని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు భాజపా నాయకత్వంలో ఉన్నప్పుడే అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతాయని జగన్ పేర్కొన్నారు.దేశానికి నూతన జవసత్వాలు అందించి ప్రగతి పథకాలకు నూతన ఒరవడిని మోడీ తీర్చిదిద్దారని అభివర్ణించారు. భాజపా కు అండదండలు అందించిన ఉపాధ్యాయ పట్టభద్రుల ఓటర్లందరికి ప్రజలకు జగన్ అభివాదాలు తెలియజేశారు. రాబోవు రోజులలో రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు కార్యక్రమంలో న్యాయవాదులు బిట్ల రవి ,పిల్లి శ్రీకాంత్,విఘ్నేష్ పడిగేల వెంకటేశ్వర్, అంజలి, లక్మన్ రాజు,యాదగిరి,కేశవరావు, నారాయణ దాసు,అనిల్ వి మ్ మహేష్, దిలీప్, అవుల నారాయణ, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు ప్రచారాలతో అడ్మిషన్లు నిర్వహిస్తున్న పాఠశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

**- జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు...**



**కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,మార్చి 06 :**
ప్రెసిడెన్సి విద్యా సంస్థల యజమాన్యం తప్పుడు ప్రచారాలతో అడ్మిషన్లు నిర్వహిస్తు విద్యార్థులను మోసం చేస్తున్నయజమాన్యంప్తై క్రిమినల్ కేసు నమోదు చేయాలని గురువారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం నాయక్ మాట్లాడుతూ నిజామాబాద్ రూరల్ మండలం భారతీ గార్డెన్ దగ్గర (ప్రెసిడెన్సీ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్) పేరుతో ప్రెసిడెన్సీ ఇంటర్నేషనల్ (ఆరావళి క్యాంపస్)స్కూల్ ఈ స్కూల్ కి విద్యా శాఖ నుండి ఎటువంటి అనుమతి లేకున్నా, బిల్డింగ్ పూర్తికాకముందే అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మోసం చేస్తూ 50 శాతం ఫీజు ముందే వసూలు చేస్తున్నటువంటి ప్రెసిడెన్సి స్కూల్ యజమాన్యం పైన క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ నగరంలో పెట్టినటువంటి హోర్డింగులు అన్నిటిని తొలగించాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్య శాఖ నుండి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ముగిసింది కావున విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాల్సిందిగా కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి,నాయకులు సుభొద్,కుశాల్,శివాజీ పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో 240 సైలెన్సర్ల ధ్వంసం

**కబురు న్యూస్,నిజామాబాద్,మార్చి 06 :**
నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లను ఏర్పాటు చేసి శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నద్విచక్ర వాహనదారులపై కొరడా ఝుళిపించారు.గురువారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ లో ట్రాఫిక్ ఏసీపీ నారాయణ,సిఐ ప్రసాద్ ల ఆధ్వర్యంలో వాహనాల సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నా వాటిని రోడ్డు రోలర్ తో తొక్కించారు.మొత్తం 240 సైలెన్సర్లను ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ నారాయణ మాట్లాడుతూ గత రెండు మూడు నెలల నుండి వాహనాల తనిఖీలు చేస్తూ సైలెన్సర్ లను తొలగించి వారిపైన చర్యలకు ఆదేశించామని,ఇక ముందు ఎవరైనా యువకులు ద్విచక్ర వాహనాలకు ప్రత్యేక సైలెన్సర్ లు అమర్చిన,షోరూంల యజమానులకి,మెకానిక్ దుకాణల యజమానులకు,వాహనదారుల పైన కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.





# మల్లాపూర్ మండల కేంద్రంలో రైతు ఐక్య వేదిక నాయకుల నిరసన.



కబురు న్యూస్, మల్లాపూర్. మార్చి 6.
మల్లాపూర్ మండల కేంద్రంలోని స్థానిక భరతమాత కూడలి వద్ద గురువారం జగిత్యాల జిల్లా రైతు ఐక్య వేదిక నాయకులు స్థానిక రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇట్టి కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, రైతులను విస్మరిస్తుందని అలాగే రైతు సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చూపుతున్నారని, ఐక్యవేదిక నాయకులు ఇరు ప్రభుత్వాలను దుయ్యబట్టారు. అలాగే రైతు పండించే పంటలకు మద్దతు ధర ఇవ్వాలని, పసుపు పంటను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని,అలాగే బోనస్ ప్రకటించాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐక్యవేదిక నాయకులతోపాటు స్థానిక రాజకీయ నాయకులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన కంటారెడ్డి



కబురు న్యూస్, నిజాంపేట 06-03-25
మండల కేంద్రానికి చెందిన భోదనం మల్లేశం గురువారం మృతి చెందిన విషయాన్ని కంటారెడ్డి తిరుపతిరెడ్డికి బిఆర్ఎస్ నాయకులు తెలియజేయడంతో వెంటనే స్పందించిన కంటరెడ్డి తిరుపతిరెడ్డి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చలిమేటి నాగరాజు, మండల యూత్ అధ్యక్షులు మావురం రాజు, తాడెం మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

# చల్మెడ లో చాకలి ఐలమ్మ విగ్రహా ఆవిష్కరణ

కబురు న్యూస్,నిజాంపేట్ 06.03.25




నిజాంపేట మండల పరిధిలోని చలిమెడ గ్రామంలో సాకలి ఐలమ్మ విగ్రహా ప్రతిష్ట కార్యక్రమం గ్రామ రజక సంఘం సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రజక సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి హాజరై విగ్రహానికి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బల్ రెడ్డి మాజీ ఉపసర్పంచ్లు రమేష్ రాజ్యం గ్రామ రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# పోగొట్టుకున్న మొబైల్ ను బా ధితునికి అప్పగించిన ఇబ్రహీంపట్నం ఎస్సై పట్టణం.

కబురు న్యూస్, మెట్ పల్లి, మార్చి 6.
జగిత్యాల జిల్లా మెట్పల్లి పోలీస్ సర్కిల్ పరిధిలోని ఇబ్రహీంపట్నం మండలం లోనివేముల కుర్తి లోని పౌల్ట్రీ ఫారం నందు పనిచేశే మహమ్మద్ అత్తర్ సిద్దిపేటకు చెందిన అతను ఫిబ్రవరి 19 న తన యొక్క ఫోను ఎక్కడో పడిపోయిందని ఫిబ్రవరి 21న అతడు పోలీస్ స్టేషన్ కి వచ్చి ఫిర్యాదు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు. ఆయన మొబైల్ వివరాలను సీ ఈ ఐ ఆర్ లో నమోదు చేయడంజరిగిందని ఎస్సై తెలిపారు. అయితే ఆ బాధితుడు పోగొట్టుకున్న తన ఫోనును గురువారం




ట్రేస్ అవుట్ చేసి అతడికి అప్పగించడం జరిగిందని ఇబ్రహీం పట్నం ఎస్సై అనిల్ తెలిపారు. ఎవరైనా వారి ఫోన్‌పోగొట్టుకున్న , దొంగతనానికి గురి అయిన ఫోన్ వివరాలను సీ ఈఐ ఆర్ పోర్టల్ లో నమోదు చేస్తే తిరిగి ఆ మొబైల్ ఫోన్ ను పొందే అవకాశం ఉంటుందని ఎస్సై అనిల్ ఈ సందర్భంగా అన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి, ఎవరికైనా మొబైల్ ఫోన్లు ఇతర విలువైన వస్తువులు దొరికి తేవాటిని సమీప పోలీస్ స్టేషన్ల వెంటనే అప్పగించాలని ఇబ్రహీంపట్నం ఎస్సై ఏ. అనిల్ తెలి పారు.

# ప్రారంభమైన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతం

- మొదటి రోజు 420 మంది విద్యార్థులు గైర్హాజరు...
- జిల్లాలో తొలి మాల్ ప్రాక్టీస్ కేసు...

కబురు న్యూస్,నిజామాబాద్ మార్చి 06 :
ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలిపారు. గురువారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ భాష సబ్జెక్టతో పరీక్ష లు రాశారని, వారిలో 420 విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. ఒక విద్యార్థి చీటీ లు రాయగా పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశామని అన్నారు. దీంతో జిల్లాలో తొలి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదైందని



తెలిపారు. మొత్తం జిల్లాలో 15,923 మంది విద్యార్థులకు గాను16,343 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలియజేశారు. మొత్తం 97.4 శాతం విద్యార్థులు పరీక్షలు రాయగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించామని తెలియజేశారు. జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను 49 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు. నిజామాబాద్ ఖిల్లా బాలుర జూనియర్ కళాశాల - బీ సెంటర్ లో ఓ విద్యార్థి చీటీలు రాస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసింది.జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులతో పాటు తాను ఫ్లయింగ్,సిట్టింగ్ స్క్వాడ్ లు,హై పవర్ కమిటీ,బల్క్ అధికారి,కస్టోడియన్లు తనిఖీ చేసి పర్యవేక్షణ చేసారని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలియజేశారు.జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ నిజామాబాద్ పట్టణంలోని ఖిల్లా బాలుర జూనియర్ కళాశాల ఏ సెంటర్,బి సెంటర్,నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల,కంటేశ్వర్ లోని ఎస్సార్ జూనియర్ కళాశాలలను,రవి,కాకతీయ జూనియర్ కళాశాల ఏ సెంటర్,బీ సెంటర్,మహిళా కాకతీయ జూనియర్ కళాశాలలను తనిఖీ చేసి సమీక్షించారు.

# 8న జాతీయ లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్త సునీత కుంచాల...

కబురు న్యూస్,నిజామాబాద్ మార్చి 06 :
ఈ నెల 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి,జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్ సునీత కుంచాల తెలిపారు.గురువారం జిల్లాకోర్టు ప్రాంగణంలోని న్యాయసేవ సదన్ లో విలేకరుల సమావేశంలో ఆమె సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి పద్మావతితో కలిసి మాట్లాడారు.ప్రజలందరికి న్యాయవిజ్ఞానాన్ని అందించడంలో సంస్థ తనవంతు కృషి చేస్తున్నదని అన్నారు.పొక్సో క్రిమినల్ కేసులలో బాధితులకు ఆర్థికంగా అండగా నిలిచామని పేర్కొన్నారు.హత్యకేసులలో తల్లిదండ్రులను కోల్పోయిన




బాలలకు ఆర్థిక పరిహారాన్ని అందించి వారి భవిష్యత్తు భద్రతకు భద్రమైన పునాధిని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.జాతీయ న్యాయసేవ ప్రాధికార సంస్థ నాల్సా ప్రోత్సహం,ప్రేరణ నే స్ఫూర్తిగా నిలిచిందని అభివర్ణించారు. మహిళ సాధికారతకు సంస్థ చేదోడుగా నిలిచిందని అన్నారు. జిల్లాలో బాలికల స్వయం భద్రతకు బాటలు వేశామని,ఆత్మరక్షణకు అవసరమైన మేరకు శిక్షణ ఇప్పించడం న్యాయసేవ సంస్థ కీర్తికిరీటంలో కలికి తురాయిగా నిలిచిపోతుందని జిల్లాజడ్జి అభిలషించారు.రాజీపద్దతిన రాజీపడదగిన క్రిమినల్ కేసులు,అన్ని రకాల సివిల్ దావాలు వీలైనంత వరకు జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కారం అయ్యే విదంగా కృషి చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారం లీగల్ అవేర్ నెస్,మాడ్యూల్ క్యాంప్ లను జిల్లా అధికార యంత్రాంగం సహకారంతో విజయవంతంగా నిర్వహించినట్లు తెలియజేశారు. శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

# సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫేర్....



కబురు న్యూస్,బోధన్ మార్చి 06..
బోధన్ డివిజన్ సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫేర్ నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన సైన్స్ ఫేర్ కార్యక్రమాన్ని గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజీ మంజూష గోగినేని చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా



విద్యార్థులు వివిధ రకాల ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. సైన్సుకు సంబంధించిన ముగ్గులు వేశారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. పందిరి వ్యవసాయ సాగు విధానం, మిస్సైల్ లాంచర్, ఇంట్లో దుమ్ము దులిపేటప్పుడు కండ్ల కండ్ల పడకుండా గొడుగు సహాయంతో దుమ్మును దులిపే కొత్త విధానాన్ని ప్రదర్శించారు. విద్యార్థి అర్చన సోలార్



సిస్టంను ప్రదర్శించారు. విజ్ఞాన శాస్త్ర పరికరాలు,సామాగ్రిని ల్యాబ్ లోని వస్తువులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యాయులు సంతోష్ యాదవ్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు జ్యోష్ణ, విజయలక్ష్మి, శోభారాణి, విజయ్ కుమార్, సంగీతరావు ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రాబోయేది బిజెపి రాజ్యమే మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్....

కబురు న్యూస్, గన్నేరువరం మార్చి 06

**అభివృద్ధికే పట్టం గట్టిన ప్రజలు ఎమ్మెల్సీలు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్కాకొమురయ్య గెలుపుతో బీజేపీ నేతల సంబరాలు.**

గన్నేరువరం కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు మార్పుకు సంకేతమని, రాబోయేది బీజేపీ రాజ్యమేనని బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ అన్నారు. గురువారం బీజేపీ అభ్యర్థుల గెలుపుపై మండల కేంద్రంలో నికేష్ ఆధ్వర్యంలో బీజేపీ నేతలు బాణాసంచా కాల్చి మిటాయిలు పంచి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా తిప్పర్తి నికేష్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు కాంగ్రెస్ పార్టీని నమ్మలేదన్నారు. ప్రభుత్వం పై ఉన్న ప్రజావ్యతిరేకతతోనే బీజేపీకి మద్దతిచ్చారని, ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ డబ్బులతో ఓటర్లను ప్రలోభ పెట్టినా, ఓటుకు రూ. 5వేలు పంచినా జనం నమ్మలేదని, దేశం కోసం ధర్మం కోసం పనిచేసినా బీజేపీ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. రాష్ట్రంలో



అరాచక పాలన కొనసాగుతోందని, జనం మరోసారి రుజువు చేశారని నికేష్ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో బీజేపీ పార్టీ బలోపేతమవుతోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీజేపీ పార్టీ విజయం సాధిస్తుందని, ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా బీజేపీ హావా కొనసాగుతోందని, మోడీ నాయకత్వంపై ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారని, ఆయన పేర్కొన్నారుఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏలేటి చంద్రారెడ్డి గుంటుక శంకర్ సామ రాజిరెడ్డి, బోడా భాస్కర్ రెడ్డి పుల్లల రాము, బండి తిరుపతి, రామచంద్రం, పంబాల రాజశేఖర్, నందికొండ సురేందర్ రెడ్డి, అనిల్ రెడ్డి, గుమ్మడి సురేందర్ రెడ్డి, గుంటుకలక్ష్మీపతి, రాజిరెడ్డి, అభిలాష్, గణేష్, అనుమండ్లరాజిరెడ్డి, బలరాం రెడ్డి, అనంతరెడ్డి, చంద్రారెడ్డి, కొలుపుల మహేందర్, ప్రశాంత్, బోయిన వేణు, సంతోష్, భూమేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికేట్ లేదని చిన్నారిని పాఠశాల నుండి తీసేసిన సిబ్బంది

- చెత్తలో దొరికిన పుస్తకంలో అక్షరాలు దిద్దుతూ చదువుకుంటున్న చిన్నారి
- చిన్నారి ఇంట్లో పుట్టడంతో జనన ధ్రువీకరణ పత్రం ఇవ్వని ఆసుపత్రి సిబ్బంది
- 10 వేలు ఇస్తే పత్రాలు ఇప్పిస్తాం అంటున్న దళారులు



కబురు న్యూస్, హైదరాబాద్ మార్చి 6
హైదరాబాద్ సనత్‌నగర్‌లోని దాసారం బస్తీలో ఉండే అశోక్, మమత దంపతుల కూతురు శ్రీవిద్య(8)కు చదువుపై మక్కువ ఎక్కువ అందరూ పిల్లల్లానే తాను చదువుకోవాలని అనుకుంది.. కానీ శ్రీవిద్యకు ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికేట్ లేదని స్థానిక పాఠశాలలో చేర్చుకోలేదు తల్లిదండ్రులు శ్రీవిద్యను ఏడాది క్రితం స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించగా, తనకు ఆధారు కార్డు, బర్త్ సర్టిఫికేట్ లేదని యాజమాన్యం పాఠశాల నుండి పంపించారు బర్త్ సర్టిఫికెట్ కోసం అధికారులను సంప్రదిస్తే.. పాప ఏ తారీఖున పుట్టిందనే వివరాలతో ఆసుపత్రి వారు ఇచ్చిన పత్రం తేవాలంటున్నారని.. పాప ఇంట్లోనే పుడితే ఆ పత్రం ఎలా నుంచి తేవాలని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రూ.10 వేలు ఇస్తే అన్ని పత్రాలూ సిద్ధం చేస్తామని కొందరు చెబుతున్నారని.. అంత డబ్బు తమ దగ్గర లేదని శ్రీవిద్య తల్లిదండ్రులు వాపోయారు అధికారులు దయ తలచి ఆ సర్టిఫికెట్లు ఇప్పించి తమ కూతురు చదువుకునేలా చూడాలని వేడుకున్నారు

## పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న దుద్దిల్ల శ్రీను బాబు



కబురు న్యూస్, రామగిరి మార్చ్ 06.
గురువారం రోజు ఆదివారం పేట ఎస్సీ కాలనీ లో ఇల్లందుల రమేష్ రజిత ల ఏకైక పుత్రిక శైలజ, శ్రీధర్ పెళ్లి వేడుకలో నూతన వధూవరులను ఆశీర్వాదించిన మన నాయకులు దుద్దిల్ల శ్రీను బాబు.అనంతరం రామగిరి మండలం నాగేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య అన్నయ్య తీగల పోచమ్మ-లింగయ్య కోడుకు వెంకటేష్-వాణి వివాహం సి.ఈ.ఆర్ రాణి రుద్రమ్మ దేవి స్టేడియం గ్రౌండ్ లో వారి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన దుద్దిల్ల శ్రీను బాబు.వారి వెంట మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్,రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొడ్డ బాపు,రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివారం పేట గ్రామం లో సీసీ రోడ్ పనులు ప్రారంభం



కబురు న్యూస్, రామగిరి మార్చ్ 06.
గురువారం రోజు ఆదివారం పేట గ్రామం లో తెలంగాణ రాష్ట్ర ఐ టి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు గ్రామంలోని గొల్లవాడ లో ఐదు లక్షల సీసీ రోడ్ పనులు ప్రారంభం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు మైదం బుచ్చయ్య,మాజీ సర్పంచ్ వేపచెట్టు రాజేశం,మాజీ ఉపసర్పంచ్ అట్టేతిరుపతి రెడ్డి,మాజీ ఎంపీటీసీ కన్నూరి నర్సింగరావు,రామగిరి మండలం యూత్ ఉపాధ్యక్షులు గోడిశేల సంతోష్,గ్రామ ఎస్ సి సి ఎల్ అధ్యక్షులు కన్నూరి శ్రీకాంత్,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన తొట్ల తిరుపతి యాదవ్



కబురు న్యూస్, రామగిరి మార్చ్ 06.
గురువారం రోజు రామగిరి మండలం లద్నాపూర్ గ్రామానికి చెందిన కీర్తిశేషులు దేగ నరేష్ యాదవ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్. వారివెంట రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొడ్డ బాపన్న, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొర్రె నరేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు

# బేతిగల్లో బ్రహ్మ ముహూర్తంలో గ్రామ దేవతల ప్రతిష్టాపన మహోత్సవం..

- వైభవంగా సాగిన పోచమ్మ బోనాలు..

కబురు న్యూస్,వీణవంక, మార్చి 6.
వీణవంక మండలంలోని బేతిగల్ లో నాలుగు రోజులుగా జరుగుతున్న భూలక్ష్మి మహలక్ష్మి బొడ్రాయి పోచమ్మ ప్రతిష్టాన పండగ గురువారంతో ముగిసింది. అష్టదిక్పాలకులు దద్దరిలేలా, కోటి దేవతల అనుగ్రహ ఆశీర్వాదంతో, బ్రహ్మ ముహూర్తాన,ఉదయం నాలుగు గంటల సమయం లోనే అర్చకులు నరసింహచర్యులు ఆధ్వర్యంలో విగ్రహాలు ప్రతిష్టాపన చేశారు. అంతరం భూలక్ష్మి మహలక్ష్మి బొడ్రాయి పూజ చేశారు.మహిళలు మంగళహారతిలతో వచ్చి యాగశాలా, గ్రామదేవతలైన బొడ్రాయి, భూలక్ష్మి, మహేలక్ష్మికు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు బేతిగల్ ఊరు వడ వాడల్లో నుంచి బోనాలతో పంబాల డప్పు సొప్పులతో అట పాటలలో తరలి వెళ్లారు.. పోచమ్మ తల్లి ఆలయలంలో మహిళలు



బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు పోచమ్మ ఆలయంలో పంబాల వాళ్లు కథ చెప్పి గావు పట్టారు.వీణవంక మండల బేతిగల్ గ్రామంలో భూలక్ష్మి మహేలక్ష్మి బొడ్రాయి పోచమ్మ ప్రతిష్టానపనకు హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ బాబు హాజరు అయ్యారు. ఈ సందర్భాంగా 2 లక్షల 116 రూ విరాళంగా ఇచ్చారు. గ్రామస్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రణవ్ బాబు ను శాలువా కప్పి,ఘనంగా సన్మాంచించారు..ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గంగాడి తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి,అతిధి బిల్డర్ అధినేత కొమ్మిడి రాకేష్ రెడ్డి, సాహెబ్ హుస్సేన్,పోతరవేన సతీష్ కుమార్, సమ్మిరెడ్డి, శ్రీపాల్ రెడ్డి,మద్దుల ప్రశాంత్ పటిల్, శ్రవణ్, విద్యాసాగర్,
గ్రామ శాఖ అధ్యక్షులు మద్ది అనిల్, మాసడి చొక్కారావు, మద్ది రజినీకాంత్, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన జేఎన్టీయూ బి-జోన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్:

కబురు న్యూస్, రామగిరి మార్చ్ 06.
మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం బి జోన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. కళాశాల ఆవరణలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య క్రీడా మైదానంలో అల్యూమినీ క్రికెటర్లు, కళాశాల యాజమాన్యం సహాయంతో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ను కళాశాల ప్రిన్సిపాల్ సీనియర్ ప్రొపెసర్. బి. విష్ణువర్ధన్ ముఖ్య అతిధిగా హజరై ప్రారంభించారు. టోర్నమెంట్లో పాల్గొంటున్న టీంల సభ్యులను ప్రిన్సిపాల్ పేరుపేరున పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. వివాదాలకు తావులేకుండా తటస్థ ఎంపైర్లతో మ్యాచ్లు





నిర్వహించాలన్నారు. టీంలను పంపించిన కళాశాలల యాజమాన్యాలకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. టోర్నమెంట్లో పాల్గొంటున్న టీంలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, చక్కటి వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాలకు చెందిన 12 టీంలు



టోర్నమెంట్లో పాల్గొంటున్నాయి. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తున్నారు. క్రీడాకారులకు ఉచిత వసతితో పాటు భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. ఫిజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో లైబ్రరీ ఇంచార్జి రమణ, పరిపాలనాధికారి సుమన్, ఎఇఇ ప్రభాకర్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్. సునీల్ కుమార్, కాంట్రాక్టర్ శ్రావణ్, క్రీడాకారులు తదితరులు పాల్గోన్నారు.

# భవిష్యత్తు లో తెలంగాణ భారతీయ జనతా పార్టీదే..

- అంజిరెడ్డి గెలిపుతో శంకరపట్నంలో సంబరాలు..
- జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి..

కబురు న్యూస్,శంకరపట్నం మార్చి 06
భవిష్యత్తులో తెలంగాణలో బిజెపి పార్టీ ప్రభుత్వం ఏర్పడుతుందని, బిజెపి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకర పట్నం మండల కేంద్రంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఎనుగుల అనిల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి చిన్న మైల్ అంజిరెడ్డి గెలుపొందిన సందర్భంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ లో బిజెపి పార్టీ రానున్న రోజుల్లో అధికారం చేపట్టడం ఖాయమని, కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేంద్రమంత్రి వర్గం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను దేశవ్యాప్తంగా ఉన్న పేద బడుగు



బలహీన వర్గాల ప్రజలు స్వాగతిస్తూ అన్ని రాష్ట్రాల్లో బిజెపి పార్టీకి పట్టం కడుతున్నారని, తెలంగాణలో జరిగిన పట్టభద్రుల టీచర్స్, ఎమ్మెల్సీ కరీంనగర్, అదిలాబాద్, నిజాంబాద్, మెదక్ పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బిజెపి పార్టీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీగా చిన్న మైల్ అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీగాఎం కొమరయ్య, ను ప్రాధాన్యత ఓట్లు రెండో ప్రాధాన్యత ఓట్లు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు పట్టభద్రులకు, టీచర్స్ కు ధన్యవాదాలు తెలుపుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించినందుకు బిజెపి పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించి, భారీ ర్యాలీ, బాణాసంచా పిలిచి మిఠాయి పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, నాయకులు రాస మల్ల శ్రీనివాస్, పెసరు వీర అర్జున్, సంపత్, వెంకటలక్ష్మి, బిజిలి సారయ్య, జగ్గారెడ్డి, సాయి ప్రకాష్, రాజిరెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రశాంత్, జైపాల్ యాదవ్, కొండాల్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామదేవతల ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి..

- పాడి పంటలతో బేతిగల్ గ్రామం విరసిల్లాలి..
- బొడ్రాయి ఉత్సవాలకు 2,00,116 రూపాయల విరాళం...
- కాంగ్రెస్ ఇంచార్జ్ ప్రణవ్ బాబు..

కబురు న్యూస్, వీణవంక,మార్చి 6.
వీణవంక మండలం బేతిగల్ గ్రామంలో జరుగుతున్న భూలక్ష్మి,మహలక్ష్మి,బొడ్రాయి,సహిత పోచమ్మ తల్లుల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలికారు.అనంతరం గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఊరిని కంటికి రెప్పలా కాపాడుకునే గ్రామదేవతల విగ్రహ



ప్రతిష్ఠ కార్యక్రమపూజలో పాల్గొనడం సంతోషాన్ని కలిగించిందని,గ్రామంలోని ప్రజలందరూ పండగకు రావడం వలన గ్రామమంతా సందడిగా ఉందని అన్నారు.శ్రమ తీసుకుని ఇంతటి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను



అభినందించారు. కాంగ్రెస్ ఇంచార్జ్ ప్రణవ్ బాబు గ్రామ దేవతల ప్రతిష్ఠ మహోత్సవానికి 2,00,116 రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో బేతిగల్ గ్రామశాఖ కాంగ్రెస్ నాయకులు,వీణవంక మండల నాయకులు,గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో

# 300 కోట్లు దాటిన సంక్రాంతికి వస్తున్నాం

కబురు సినిమా మార్చి06:



విక్టరీ వెంకటేష్ నటించిన సినిమాలు ప్రేక్షకులకి ఏ మాత్రం బోర్ కొట్టించవు. సూపర్ హిట్ కాకపోయిన మినిమం ఆడతాయి. ఆయన నటించిన తాజా చిత్రం సంక్రాంతికి వస్తున్నాం. ఈ మూవీ సంక్రాంతి కానుకగా వచ్చి సూపర్ హిట్ అయింది. థియేటర్లలో రూ. 300 కోట్లకుపైగా వసూళ్లు సాధించి రికార్డు సృష్టించింది.రీసెంట్‌గా 50 రోజులు కూడా పూర్తి చేసుకుంది. 92 సెంటర్లలో 50 రోజులు పూర్తి కావడంతో ఈ మైలురాయి తమ ఎగ్జిబిటర్లు, పంపిణీదారుల అచంచలమైన అంకితభావంతో సాధ్యమైందని, వారు సినిమాను అన్ని మూలలకు చేరేలా చూశారంటూ దర్శకుడు అనీల్ రావిపూడి ఎమోషనల్ ట్వీట్ చేశారు. అయితే ఇంత మంచి హిట్ తర్వాత వెంకటేష్ కథల విషయంలో చాలా జాగ్రత్తలు పడుతున్నాడట. ఏ సినిమా పడితే ఆ సినిమా చేయకుండా ప్రేక్షకులకి మరింత వినోదం పంచేలా సినిమా చేయాలని అనుకుంటున్నాడట. సంక్రాంతికి వస్తున్నాం సినిమా రిలీజ్ తర్వాత వెంకటేష్ దాదాపుగా 25కు పైగా కథలు విన్నాడని టాక్. అయితే వాటిలో వెంకీ ఒక్కటి కూడా ఓకే చేయలేదు అని టాక్ . ఏ మాత్రం కొద్దిగా బాలేదు అని అనిపించినా ఎంత పెద్ద డైరెక్టర్ అయిన కూడా వెంకటేష్ మొహమాటం లేకుండా నో చెప్పేస్తున్నాడట. అందుకు కారణం గత అనుభవాలే మరి. వెంకటేష్ ప్రధాన పాత్రలో రూపొందిన ఎఫ్ 2, ఎఫ్ 3 చిత్రాలు ఎంత పెద్ద విజయం సాధించాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ సినిమాల తర్వాత శైలేష్ కొలను డైరెక్షన్‌లో సైంధవ్ అనే యాక్షన్ సినిమా చేశాడు. ఆ మూవీ పెద్ద డిజాస్టర్‌గా మిగిలింది. ఆ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని సంక్రాంతికి వస్తున్నాం సక్సెస్‌ను కంటిన్యూ చేయాలని భావిస్తున్న వెంకటేష్ కథల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నాడట.

# శ్రీలీలకు ఆఫర్ల మీద ఆఫర్లు..

కబురు సినిమా మార్చి06:



ప్రధానంగా తెలుగు, కన్నడ సినిమాల్లో హీరోయిన్ గా నటిస్తుంది. ఆమె 2017లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించింది. 2019 కన్నడ కిస్‌తో పాటు తెలుగులో పెళ్లి సందడి, ధమాకా వంటి చిత్రాలతో మంచి పేరు తెచ్చుకుంది. తెలుగు ఉత్తమ నటిగా అవార్డును గెలుచుకుంది ఈ బ్యూటీ. తర్వాత తెలుగు వరుస సినిమాలు చేస్తు బిజీగా ఉన్న ఈ వయ్యారి గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం రండి.. 14 జూన్ 2001న డెట్రాయిట్ లోని మిచిగాన్ లో ఒక తెలుగు కుటుంబంలో జన్మించింది శ్రీలీల. బెంగుళూరులో పెరిగింది. ఆమె తల్లి స్వర్ణలత బెంగళూరులో గైనకాలజిస్ట్. స్వర్ణలత పారిశ్రామికవేత్త సూరపనేని శుభాకరరావుతో విడిపోయిన తర్వాత స్వర్ణలతకు లీల జన్మించింది. తన చిన్నతనంలోనే 5 ఏళ్ల వయసులో భరతనాట్యంలో శిక్షణ ప్రారంభించింది. ఆమె డాక్టర్ కావాలని కోరికతో 2022లో ఆమె చివరి పూర్తి చేసింది ఈ వయ్యారి. 2017లో చిత్రాంగద అనే తెలుగు హారర్ సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసింది. ఈ సినిమలో ప్రధాన పాత్రలో కనిపించిన సింధు తోలాని చిన్నప్పటి పాత్రలో నటించింది . తర్వాత కిస్ అనే కన్నడ చిత్రంతో తొలిసారి కథానాయకిగా కనిపించింది. 2021లో పెళ్లి సందడి సినిమాతో కథానాయకిగా తెలుగు చలనచిత్ర అరంగేట్రం చేసింది. ఇందులో ఈమె నటనకి సైమా వైదికపై మోస్ట్ ప్రామిసింగ్ న్యూకమర్ అవార్డు అందుకుంది. తర్వాత ధమాకా చిత్రంలో హీరోయిన్ గా నటించి బ్లాక్ బ్లాక్ బస్టర్ అందుకుంది. దీనికి సైమా ద్వారా ఉత్తమ నటి అవార్డు అందుకుంది. తర్వాత వరుస సినిమాలు చేసింది. 2023లో స్కంద, భగవంత్ కేసరి, ఆదికేశవ, ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్, వంటి సినిమాల్లో నటించగా భగవంత్ కేసరి మాత్రమే ఆకట్టుకుంది. 2024లో గుంటూరు కారంలో నటించిన అది ఆశించిన ఫలితాన్నిఅందుకోలేకపోయింది. అదే ఏడాది పుష్ప 2లో స్పెషల్ సాంగ్ చేసి అలరించింది. ప్రస్తుతం నితిన్ సరసన రాబిన్?హుడ్, రవితేజకి జోడిగా మాస్ జాతర, పవన్ కళ్యాణ్ పక్కన ఉస్తాద్ భగత్ ?సింగ్ చిత్రాల్లో నటిస్తుంది. అలాగే తమిళంలో శివ కార్తికేయన్ హీరోగా వస్తున్న పరాశక్తిలో కథానాయికగా నటిస్తుంది. వీటితో పాటు హిందీలో ఓ సినిమాకి సైన్ చేసింది.

# అందం.. అభినయంతో ఆకట్టుకుంటున్న మృణాళిని రవి

కబురు సినిమా మార్చి06:

మృణాళిని రవి తమిళం, తెలుగు చిత్రాలలో నటించి కథానాయకిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. సినిమాల్లో ఆమె నటనతో ప్రేక్షకులను తనదైన శైలిలో ఆకట్టుకుంటుంది ఈ బ్యూటీ. ఎప్పుడు సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉంటూ తన సినిమా అప్డేట్స్, ఫొటోలతో అభిమానులను అలరిస్తుంది ఈ ముద్దుగుమ్మ. తాజాగా కొన్ని ఫోటోలను షేర్ చేరేసింది. చీరలో ఈ బ్యూటీని చుసిన కుర్రాళ్ల వావ్, సూపర్ అంటూ కామెంట్స్ పెడుతున్నారు. 10 మే 1995న కేంద్రపాలిత ప్రాంతం అయినా పాండిచ్చేరిలో ఓ సాధారణ తమిళ కుటుంబంలో పుట్టి, పెరిగింది మిర్నాళిని రవి. అందంతో పాటు అభినయంతో ప్రేక్షకులను తనదైన నటనకి ఫిదా చేస్తుంది ఈ బ్యూటీ. బెంగుళూరులోని ఈస్ట్ పాయింట్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ నుండి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో బ్యాచిలర్ డిగ్రీ పట్టభద్రురాలైంది. బెంగుళూరులోనిలో సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్‌గా పనిచేసింది. నటనపై ఆసక్తితో తన ఉద్యోగాన్ని విడిచిపెట్టింది. తమిళం, తెలుగు భాషలలో సుపరిచితురాలు. డబ్స్మాష్ వీడియోలను అప్‌లోడ్ చేస్తూ సోషల్ మీడియాలో పేరు తెచ్చుకుంది. దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా ఆమె వీడియోలలో ఒకదాన్ని చూసి తనను ఆడిషన్ కోసం పిలిచి తన సినిమాలో ఎంపిక చేసారు. అలా 2019లో సూపర్ డీలక్స్ అనే ఓ తమిళ చిత్రంలో ఏలియన్ అమ్మాయిగా సినీ అరంగేట్రం చేసింది ఈ వయ్యారి భామ. తర్వాత అదే ఏడాది వరుణ్ తేజ్ గద్దలకొండ గణేష్ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించి తెలుగు తెరకు పరిచయం అయింది. 2023లో సయ్యద్ సోహెల్ కి జోడిగా ఆర్గానిక్ మామా హైబ్రిడ్ అల్లుడు, సుధీర్ బాబుకి జంటగా మామా మశ్చేంద్ర చిత్రాల్లో కనిపించింది. ఇటీవల తమిళ రొమాంటిక్ కామెడీ డ్రామా చిత్రం రోమియో సినిమాతో ఆకట్టుకుంది ఈ అందాల తార.




# డైరెక్టర్ అట్లీకుమార్‌తో బన్నీ సినిమా ప్లాన్

కబురు సినిమా మార్చి06:

ఒకరు వెయ్యి కోట్ల క్లబ్ లో తాజాగా చేరిన సౌత్ స్టార్ – మరొకరు తన హిందీ సినిమాతో వెయ్యి కోట్లు చూసిన తమిళ డైరెక్టర్. ఇప్పుడు వీరిద్దరూ కలిస్తే 'రెండు వేల కోట్లు' అవుతుందా ఏంటని అనుకుంటున్నారు. ఏమో గుర్రం ఎగరావచ్చు. ఇంతకూ ఆ ఇద్దరు ఎవరంటారా!? స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, యంగ్ అండ్ ఎనర్జిటిక్ డైరెక్టర్ అట్లీ కుమార్. 'పుష్ప– ద రూల్' రిలీజై రికార్డులు కొట్టేయగానే బన్నీ తరువాతి సినిమా ఏంటనే చర్చ ఫ్యాన్స్ లో ఊపందుకుంది. త్రివిక్రమ్ డైరెక్షన్ లో బన్నీ సినిమా అని కొందరు, కాదు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో అల్లు అర్జున్ నటించబోతున్నాడని ఇంకొందరు అన్నారు. వారిద్దరూ కాకుండా తమిళ దర్శకుడు అట్లీ కుమార్ తో సాగడానికి బన్నీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఎందుకని బన్నీ అట్లీ వైపు మొగ్గాడు అన్న ప్రశ్నకు సరైన సమాధానమే వినిపిస్తోంది. అదేమిటంటే – అట్లీ దగ్గర బన్నీకి తగ్గ స్క్రిప్ట్ సిద్ధంగా ఉందట! అంతేకాదు శరవేగంగా ఆ సినిమాను పూర్తి చేసేందుకు తగిన ప్రణాళికను కూడా అట్లీ రూపొందించుకున్నాడట. ఈ అంశాలు నచ్చడం వల్లే బన్నీ, అట్లీ సినిమాకు ఓటేసినట్టు సమాచారం. ఆ సినిమా షూటింగ్ జరుగుతూ ఉండగా, త్రివిక్రమ్, సందీప్ రెడ్డి ఇద్దరిలో ఎవరు ముందుగా సబ్జెక్ట్ తయారు చేసుకుంటే వారి సినిమాలోనే బన్నీ నటించబోతాడనీ తెలుస్తోంది. అంతేకాదు, ఈ సినిమా కోసం ఇప్పటికే బన్నీ విదేశాలకు వెళ్ళి మేకోవర్ అయ్యాడట. అందులో భాగంగానే స్పెషల్ ట్రైనింగ్ కూడా తీసుకున్నాడట. ప్రస్తుతం బన్నీకి ఆల్ ఇండియాలో ఉన్న ఇమేజ్ ను దృష్టిలో పెట్టుకొనే అట్లీ కథను రూపొందించాట. ఈ సినిమాను పాన్ వరల్డ్ మూవీగానూ సిద్ధం చేయాలని అట్లీ తపిస్తున్నట్టు సమాచారం. ఈ చిత్రంలో మరో కీలకమైన పాత్రకు తమిళ హీరో శివకార్తికేయన్‌ను ఎంపిక చేసుకున్నట్టూ తెలుస్తోంది. ప్రస్తుతం సుధా కొంగర దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో శివకార్తికేయన్ నటిస్తున్నాడు. సుధతో తన పార్ట్ మొత్తం ఏప్రిల్ లోగా చిత్రీకరించాలని శివకార్తికేయన్ కోరినట్టు సమాచారం. మే నుండి బన్నీ సినిమాలో తాను పాల్గొనబోతున్నానని శివకార్తికేయన్ సన్నిహితులకు చెప్పినట్టూ వినిపిస్తోంది.

# రాంగోపాల్‌వర్మకు హైకోర్టులో ఊరట

కబురు సినిమా మార్చి06:



టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మకి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన దర్శకత్వంలో వచ్చిన కమ్మ రాజ్యంలో కడప రెడ్లు అనే సినిమాకు సంబంధించి నమోదైన కేసులో విచారణపై హైకోర్ట్ స్టే విధించింది. ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు కొంతమంది వ్యక్తులను ఉద్దేశించి తీయడంతో పాటు విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని ఆర్జీవీపై మంగళగిరి సమీపంలోని ఆత్మకూరుకు చెందిన బండారు వంశీకృష్ణ సీఐడీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన సీఐడీ పోలీసులు ఆర్జీవీకి నోటీసులు ఇవ్వడంతో పాటు విచారణకు హాజరుకావాలని కోరారు. అయితే సీఐడీ నోటీసులను సవాల్ చేస్తూ ఆర్జీవీ హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశాడు. అయితే ఈ పిటిషన్‌కి సంబంధించి ఆర్జీవీ తరపు న్యాయవాదులు నేడు తమ వాదన వినిపిస్తూ.. 2019లో విడుదలైన సినిమాపై ఇన్నాళ్లకు ఫిర్యాదు చేయడం సమంజసం కాదని వాదించారు. ఈ వాదనను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, ఐదేళ్ల తర్వాత ఇప్పుడు ఫిర్యాదు చేయడం ఏంటి? అని ప్రశ్నించింది. అలాగే ఈ కేసుపై విచారణకు స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆర్జీవీపై సీఐడీ తదుపరి చర్యలు తాత్కాలికంగా నిలిచిపోయాయి.

# ఛావా కోసం కలెక్టర్‌కు విజ్ఞప్తి

కబురు సినిమా మార్చి06:

బాలీవుడ్‌లో బ్లాక్ బస్టర్ అందుకున్న ఛావా సినిమాను తెలుగులో విడుదల చేయనున్న విషయం తెలిసిందే. మార్చి 07న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమా విడుదలకు ముందే చిక్కుల్లో పడింది. ఈ సినిమా తెలుగు వెర్షన్ విడుదలను ఆపివేయాలంటూ ఆంధ్రప్రదేశ్ ముస్లిం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ జియా ఉల్ హక్ నేతృత్వంలోని బృందం నెల్లూరు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. ఈ లేఖలో ఛావా చిత్రం విడుదలను ఆపివేయాలని ఈ చిత్రం చరిత్రను వక్రీకరించి చిత్రీకరించబడిందని, దీని విడుదల వల్ల రాష్ట్రంలో మత సామరస్యం దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. ఈ వినతిపత్రంపై నెల్లూరు జిల్లా కలెక్టర్ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే సినిమా విడుదలపై తుది నిర్ణయం స్థానిక అధికారులు సెన్సార్ బోర్డు అభిప్రాయాల ఆధారంగా ఉండే అవకాశం ఉంది. మరోవైపు ఈ విషయం సోషల్ మీడియాలో కూడా విస్తృత చర్చకు దారితీసింది, కొందరు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తుండగా.. మరికొందరు ఫెడరేషన్ ఆందోళనలను సమర్థిస్తున్నారు. ఛావా సినిమా విషయానికి వస్తే.. మహారాష్ట్ర యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ పెద్ద కుమారుడు శంభాజీ మహరాజ్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ సినిమా వచ్చింది.




Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com